ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 15.08.2026 || సంపుటి :13 సంచిక : 26 || పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV



## రాజ్యాంగాన్ని గౌరవించండి

- వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగాలి
- జ్యోతిబా పూలే, సావిత్రిబాయి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేశారు
- మహిళా సాధికారత కోసం పాటుపడ్డారు
- దేశ పౌరులకు రాష్ట్రపతి ముర్ము పిలుపు

న్యూఢిల్లీ,ఆగస్ట్14(జనంసాక్షి):భారత రాజ్యాంగాన్ని మనం గౌరవించాలని, వికసిత్ భారత్ లక్ష్యంగా అందరూ పని చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందేశమిచ్చారు. అభివృద్ధి ఫలాలు దేశంలోని ప్రతి ఒక్కరికీ అందాలని ఆమె ఆకాంక్షించారు. అంతేకాదు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను మనం మిగతా 2లో..

తెలంగాణలో యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగార్థులకు

## తీపికబురు

పోలీసు, ఫైర్, జైళ్లు, ఎస్పీఎఫ్, ఎక్సైజ్, ట్రాన్స్‌పోర్ట్, ఫారెస్ట్ శాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని మరో 2 రెండేళ్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

వార్త 2 లో



యూపీలో గోమూత్రంతో

## డెయిరీ

పాల కేంద్రాల వలే గోమూత్ర కేంద్రాలు

రోజుకు 500 లీటర్ల సేకరణకు పైలట్ ప్రాజెక్ట్

ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో గోమూత్ర సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టును ప్రారంభించింది. పశుపోషకుల నుంచి గోమూత్రాన్ని సేకరించి, పశు సంపద ఆధారిత ఆదాయ మార్గాలను పెంచే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

న్యూఢిల్లీ(జనంసాక్షి): బులంద్‌షహర్ జిల్లా స్యానా తహసీల్‌లోని నర్సైనా గ్రామం కేంద్రంగా, రైతు ఉత్పత్తి సంస్థ ద్వారా ఈ పైలట్ ప్రాజెక్ట్ అమలవుతోంది. దాదాపు 15 గ్రామాలను అనుసంధానం చేసి, గ్రామ స్థాయిలో సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో 200 లీటర్ల సామర్థ్యం గల ట్యాంకులు ఉంచి, పశుపోషకులు సులభంగా గోమూత్రం అందించేలా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం రోజుకు సుమారు 500 లీటర్ల గోమూత్రం సేకరిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో రైతులు, పశుపోషకుల నుంచి గోమూత్రాన్ని కొనుగోలు చేసి, దానిని వివిధ ఉత్పత్తుల తయారీలో ఉపయోగించే అవకాశాలను పరిశీలిస్తున్నారు. సేకరించిన గోమూత్రాన్ని జీవ ఎరువులు, సహజ క్రిమిసంహారకాలు, వ్యవసాయ ఉపయోగ ఉత్పత్తుల తయారీకి వినియోగిస్తున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. కొనుగోలు ధరపై వివిధ నివేదికల్లో భిన్నమైన వివరాలు మిగతా 2లో..

## జనగణనలో అడగాల్సిన ప్రశ్నలు.. 40

నోటిఫై చేసిన కేంద్రం

నేడు రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్‌కార్డుల

## పంపిణీ

సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం రేవంత్

తెలంగాణ పోలీసు శాఖకు

## అరుదైన గౌరవం

రాష్ట్రానికి మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు

## ఫిర్యాదు చేయండి..

నేరాలు నియంత్రించబడతాయి : డీజీపీ సీవీ ఆనంద్

వివరాలు లోపలి పేజీల్లో..

ఈ ఏడాది నుంచి అడ్వాన్స్‌గా

# ఫీజు రీయింబర్స్‌మెంట్

## డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

ఆటోలను ఈవీలుగా మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం

అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి రూ.1.50లక్షల సబ్సిడీ

- ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సమ్మిట్‌కు ప్లాన్
- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు
- ఘనంగా నేటి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం
- క్యూర్ పరిధిలో ఆటోలను ఇవిలుగా మార్చేందుకు పథకం
- స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు
- ఏడు రకాల సన్నాల సాగుకు ప్రోత్సాహం..ప్రచారం
- మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు రూ. 2,100 కోట్ల అంచనా
- ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం
- పలు కీలక నిర్ణయాలకు తెలంగాణ కేబినేట్ ఆమోదం



హైదరాబాద్,ఆగస్ట్14(జనంసాక్షి): రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాబోయే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌ను గతేడాది కంటే మరింత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈసారి ప్రత్యేకంగా 'ఇన్వెస్ట్ తెలం గాణ' అనే థీమ్‌తో ఈ సమ్మిట్‌ను ప్లాన్ చేస్తున్నారు. అంతేకాకుండా, తెలంగాణలో మిగతా 2లో..

## చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు

- కులరహితంగా అందరికీ ఒకే విద్యకోసం కృషి
- నర్సరీ నుంచి బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అన్ని సదుపాయాలు
- గత ప్రభుత్వం కుల విద్యల పేరుతో విద్యకు పేదలను దూరం చేసింది
- పూలే దంపతుల విగ్రహావిష్కరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


వార్త 2 లో



## హర్మ్యూజ్ సమీపంలో అమెరికా నావికుల్లో మానసిక సంక్షోభం

- సామూహిక ఆత్మహత్యా యత్నాలు
- 250 రోజుల నిరంతర సముద్ర విధి
- యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌పై తీవ్ర ఆందోళన

వార్త 2 లో



## జనగణనలో అడగాల్సిన ప్రశ్నలు.. 40

**న్యూఢిల్లీజనంసాక్షి):**హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, ఉత్తరాఖండ్, లద్దాఖ్‌ల తో పాటు కొన్ని ప్రాంతాల్లో సె ప్టెంబర్ 1 నుంచి జనాభా లెక్కింపు జరగనుంది. ఈ క్రమంలోనే జనగణనలో అడ గాల్సిన 40 ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వం తాజాగా నోటిఫై చేసింది. వీటిలో కులం, కోవిడ్ టీకా వేయించుకున్న ప్రదేశం వంటి అంశాలు ఉన్నాయి. మ హిళలు, పురుషుల లెక్కింపుతో పాటు కులం, ఉపకులాలను లెక్కించి జాబితా రూపొందిం చనున్నారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని 'రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా' పర్యవేక్షణలో జనాభా లెక్కలు నిర్వహిస్తారు. ఈ ప్రాంతాలలో జనాభా గణన సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు జరుగుతుంది. అంతకుముందే, ఆగస్టు 17 నుంచి 31 వరకు ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది. ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా సమర్పించేందుకు ఉపయోగపడే 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' (ఎస్‌ఈ) పోర్టల్‌ను, జనగణనకు సంబంధించి పరిపాలనా పరమైన పర్యవేక్షణకు సాయపడే సెన్సస్ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టమ్‌ను కేంద్రం అందుబాటులోకి తీసుకువచ్చింది. కాగా.. దేశంలోని మిగిలిన ప్రాంతాలలో జనగణన వచ్చే ఏడాది ప్రారంభమవుతుంది.

## రాజ్యాంగాన్ని గౌరవించండి

గుర్తుంచుకోవాలని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. తెల్లారితే ఎనభయో స్వాతంత్య దినోత్సవ వేడుకలతో యావత్ భారతావని పులకించనుంది. ఈ చరిత్రాత్మక రోజును పునస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి ప్రసంగించారు. రాజ్యాంగాన్ని గౌరవించాలని సూచించిన ఆమె.. న్యాయ వ్యవస్థను, చట్టసభలను మనం గౌరవించాలని ప్రజలకు సందేశమిచ్చారు. తాజాగా లోక్‌సభ్‌లో మొట్టమొదటిసారిగా ఆలపించిన వందేమాతరం గీతాన్ని పౌరులంతా గౌరవించాలని ఈ సందర్భంగా రాష్ట్రపతి కోరారు. వికసిత్ భారత్–2047 లక్ష్యంగా అందరూ పనిచేయాలని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము పిలుపునిచ్చారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని చెప్పారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. దేశానికి రాజ్యాంగమే దిక్సూచి అని.. దాన్ని గౌరవించాలని కోరారు. 'జన్‌ధన్ ద్వారా దేశవ్యాప్తంగా 59 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు అందిం చాం. 80 కోట్ల మందికి రేషన్ సరకులు అందజేస్తున్నాం. ఆయుష్మాన్ భారత్ ద్వారా 60 కోట్ల మందికి వైద్యసేవలు అందుతున్నాయి. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాలు బలోపేతమయ్యాయి. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగాలి. ప్రపంచం లోనే అతిపెద్ద డిజిటల్ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకున్నారు.

## ఈ ఏడాది నుంచి అడ్వాన్స్‌గా ఫీజు రీయింబర్స్‌మెంట్

ఇప్పటివరకు స్టార్టప్‌లు సాధించిన విజయాలు, సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పేలా సమ్మిట్ ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ముగిసింది. ఈ కేబినెట్ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలసి మీడియాకు వివరించారు. ఎంపి రఘురామిరెడ్డి కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, గ్రేటర్ పరిధిలోని సిటిజన్స్ అర్బన్ రీస్ట్రక్చరింగ్ అండ్ ఎకానమీ ప్రాజెక్ట్ పరిధిలో నిర్మించతలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది. ఇకపోతే గ్లోబల్ సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను కేబినెట్ ఏర్పాటు చేయనుంది. గత ఏడాది కంటే ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనుంది. ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రజలకు వివరించనుంది. తెలంగాణలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మాతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహించనుంది. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో మూడు గంటలపాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది కంటే ఘనంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గతంలో రాష్ట్రంలో 2.81కోట్ల మంది రేషన్‌కార్డు లబ్దిదారులుండగా.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 62 లక్షల రేషన్ కార్డులను జారీ చేసిందని తెలిపారు. దీంతో ఆ సంఖ్య 3.42 కోట్లకు చేరిందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

## చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు

**హైదరాబాద్,ఆగస్ట్14(జనంసాక్షి):**చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు లభిస్తాయని, విద్య ఒక్కటే తలరాతలను మార్చే మార్గమని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 150 ఏళ్ల క్రితమే జ్యోతిబా పూలే చదువే ఏకైక మార్గమని చాటిచెప్పారని, తాను చదువుకోవడంతో పాటు తన సతీమణి సావి త్రిబాయి పూలేను చదివించి ఆదర్శంగా నిలిచారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శుక్రవారం నెక్లెస్ రోడ్డులో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మరోవైపు ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, జ్యోతిబా పూలే విగ్రహాలను ఆవిష్కరించుకోవడం గర్వకారణమని రేవంత్ పేర్కొన్నారు. నెక్లెస్ రోడ్ చౌరస్తా ఇప్పుడు అద్భుతంగా మారిందని చెప్పారు. ఇంతకాలం తర్వాత కూడా పూలేను ఆదర్శ పురుషుడిగా గుర్తిస్తున్నామంటే ఆయన ఆలోచనల గొప్పతనం అర్థమవుతోందని సీఎం అన్నారు. తమ ప్రభుత్వం జ్యోతిబా పూలే ఆలోచనలను కొనసాగిస్తోందని తెలిపారు. కుల నిర్మూలన, సామాజిక చైతన్యం సాధించాలంటే అందరూ కలిసి చదువుకో వడం, జీవించడం అవసరమన్నారు. అందుకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను తీసుకొస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నామని, నర్సరీ నుంచి విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు.

**తెలంగాణ ప్రభుత్వము**
**జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)**
**నాగర్ కర్నూల్ జిల్లా**

**No.G2/39/2026** **తేది: 07.07.2026**
**Gaz. No. 139/2026**

**భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్ట పరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము**

**ఫారం.VII**
**(Declaration) రూఢీ ప్రకటన**

నాగర్ కర్నూల్ జిల్లా **లింగాల్** మండలంలోని **రాంపూర్** గ్రామము వద్ద **అచ్చంపేట్ లిఫ్ట్ ఇరిగేషన్** క్రింద **రాంపూర్** కెనాల్ నిర్మాణ నిమిత్తము **రాంపూర్** గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన **ఎ. 8.23 గుంటలు/ సెంట్లు** భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా **అచ్చంపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద రాంపూర్ కెనాల్** నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని **ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) యం.జి.ఎల్.ఐ.యస్.పి** నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి **ఎ॥లు 8.23 గు॥** భూమి **అచ్చంపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద రాంపూర్ కెనాల్** నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను రూఢీ ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

**గ్రామము: రాంపూర్** **మండలం: లింగాల్** **జిల్లా: నాగర్‌కర్నూల్**

| క్రమ సం. | సర్వే నెం. ఎస్.డి. నెం. | పట్టా / ఇనాం etc., | భూ వర్గీకరణ మెట్ట / ఆరు తడి / తరి | భూ సేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.గుంటలు | పట్టాదారురు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల ఇతర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు చెట్ల పేర్లు | చెట్ల సంఖ్య | నిర్మాణములు వర్గము | విస్తీర్ణము |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 119 | పట్టా | మెట్ట | 0.34 | జబ్బు అంజనమ్మ తండ్రి రాములు (0.10)<br>కొట్టె మల్లయ్య తండ్రి నారయ్య (0.16)<br>కొట్టె బాల్ రాజు తండ్రి బాలస్వామి (0.08)<br>కొట్టె శివశంకర్ తండ్రి అర్జునయ్య | 120 | 111 | X-1 | X-1 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 111 | పట్టా | మెట్ట | 0.33 | చుక్కబోట్ల చిన్న నిరంజన్ తండ్రి ఈరయ్య (0.32)<br>చుక్కబోట్ల పెద్ద నిరంజన్ తండ్రి ఈరయ్య (0.01)<br>యస్ ఖాసీం తండ్రి పెద్ద నిరంజన్<br>చుక్కబోట్ల లింగస్వామి తండ్రి నిరంజన్ | 119 | 110 | 112 | X-1 | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 112 | పట్టా | మెట్ట | 1.30 | డ్యారంగుల దేవేంద్రుడు తండ్రి ఆంజనేయులు (0.02)<br>రాజు తండ్రి వెంకటయ్య (0.06)<br>డ్యారంగుల పరమేష్ తండ్రి ఆంజనేయులు (0.08)<br>డ్యారంగుల వెంకటయ్య తండ్రి అంతయ్య(0.01)<br>డ్యారంగుల నిరంజన్ తండ్రి అంతయ్య(0.06)<br>డ్యారంగుల తిర్పతయ్య తండ్రి అంతయ్య(0.01)<br>డ్యారంగుల శ్రీను తండ్రి ఆంజనేయులు (0.24)<br>డ్యారంగుల తిర్పతయ్య తండ్రి అంతయ్య(0.04)<br>యేగు (0.07)<br>మేరుగు కుర్మయ్య తండ్రి చంద్రయ్య (0.11)<br>డ్యారంగుల వెంకటయ్య తండ్రి ఎల్లయ్య<br>డ్యారంగుల చిన్నయ్య తండ్రి అంతయ్య<br>మెర్గు ఐక్కయ్య తండ్రి నాగయ్య<br>మెర్గు భూపతయ్య తండ్రి నాగయ్య<br>డి రాములు తండ్రి అంతయ్య<br>కుర్మయ్య తండ్రి నిరంజన్<br>భగవంతు తండ్రి రాములు<br>సంగిశెట్టి చంద్రయ్య తండ్రి నర్సింహ్మా<br>సంగిశెట్టి వెంకటయ్య తండ్రి నర్సింహ్మా<br>పల్లపు ఆంజనేయులు తండ్రి లక్ష్మయ్య<br>డ్యారంగుల బాలస్వామి తండ్రి ఆంజనేయులు<br>డ్యారంగుల శ్రీను తండ్రి ఆంజనేయులు<br>డ్యారంగుల రాజు తండ్రి ఆంజనేయులు<br>మేరుగు మధుబాబు తండ్రి చంద్రయ్య<br>పట్టాన్ ఇక్బాల్ తండ్రి రాహ్మంకా<br>గజ్జెల చంద్రయ్య తండ్రి మల్లయ్య<br>కొట్టముల లక్ష్మి భర్త శ్రీశైలం<br>డ్యారంగుల బాలమ్మ భర్త వీరయ్య<br>నందు తండ్రి దేవేందర్<br>యం ప్రేమ్ చందు తండ్రి కుర్మయ్య<br>తలసాని శ్రీనివాస్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి<br>మంకాల రాంరెడ్డి తండ్రి యాదగిరి రెడ్డి | X-1 | 110 | 118 | 111 | లేవు | లేవు | బావి | 1 |
| 4 | 113 | పట్టా | మెట్ట | 0.27 | డ్యారంగుల దేవేంద్రుడు తండ్రి ఆంజనేయులు (0.01)<br>డ్యారంగుల రాజు తండ్రి వెంకటయ్య (0.15)<br>గజ్జెల చంద్రయ్య తండ్రి మల్లయ్య (0.11)<br>డ్యారంగుల వెంకటయ్య తండ్రి ఎల్లయ్య<br>డ్యారంగుల చిన్నయ్య తండ్రి అంతయ్య<br>డి రాములు తండ్రి అంతయ్య<br>డి నిరంజన్ తండ్రి అంతయ్య<br>సంగిశెట్టి చంద్రయ్య తండ్రి నర్సింహ్మా<br>డ్యారంగుల బాలస్వామి తండ్రి ఆంజనేయులు<br>డ్యారంగుల పరమేష్ తండ్రి ఆంజనేయులు<br>డ్యారంగుల శ్రీను తండ్రి ఆంజనేయులు<br>పటాన్ ఇక్బాల్ తండ్రి రహ్మంకా<br>పంగ ఆంజనేయులు తండ్రి కృష్ణయ్య | 112 | 100 | X-1 | 110 | లేవు | లేవు | లేవు | లేవు |
| 5 | 100 | పట్టా | మెట్ట | 1.09 | డ్యారంగుల బాలస్వామి తండ్రి ఆంజనేయులు (0.20)<br>ఆవుల కుర్మయ్య తండ్రి లక్ష్మయ్య (0.10)<br>మైగాని జంగయ్య తండ్రి మాసయ్య (0.10)<br>డ్యారంగుల దేవేందర్ తండ్రి ఆంజనేయులు (0.09)<br>ఎ కుర్మయ్య తండ్రి లక్ష్మయ్య<br>బాలమ్మ భర్త నిరంజన్<br>యం బాలకిష్టమ్మ భర్త జంగయ్య<br>కుర్మయ్య తండ్రి నిరంజన్<br>భగవంతు రాములు తండ్రి రాములు<br>జల్లం శ్రీను తండ్రి నిరంజన్<br>డ్యారంగుల శ్రీను తండ్రి ఆంజనేయులు<br>డ్యారంగుల జయమ్మ భర్త దేవేంద్రుడు<br>డ్యారంగుల అనిత భర్త పరమేష్<br>డ్యారంగుల బాలమ్మ భర్త వీరయ్య<br>దాసర్ల లావణ్య భర్త క్రిష్ణ కందాడి కల్పన భర్త నర్సింహ్మా<br>కందాడి సత్యమ్మ భర్త శివయ్య<br>నాప జ్యోతి భర్త చంద్రుదు<br>నాప ఎల్లమ్మ భర్త నాగయ్య | 113 | 101 | 99 | 107 | లేవు | లేవు | బోరు పైప్ లైన్ | 1 |
| 6 | 99 | పట్టా | మెట్ట | 0.22 | శైలగోని జంగయ్య తండ్రి మాసయ్య (0.22)<br>యం చిన్న జంగయ్య తండ్రి మాసయ్య<br>నడిపి నిరంజన్ తండ్రి చిన్న బాలయ్య<br>వెంకటయ్య తండ్రి మాసయ్య<br>మైలగాని నీలమ్మ భర్త పెద్ద జంగయ్య<br>మైలగాని రాములు తండ్రి పెద్ద జంగయ్య<br>దౌడ ఎల్లేశ్వరి భర్త బాల్‌రాజు<br>దౌడ లక్ష్మి భర్త మధు | X-1 | 98 | X-1 | 101 | లేవు | లేవు | లేవు | లేవు |
| 7 | 95 | పట్టా | మెట్ట | 0.27 | తిర్పతమ్మ భర్త చిన్న రాయుడు (0.27)<br>తిర్పతమ్మ భర్త చిన్న రాయుడు<br>కృష్ణయ్య తండ్రి నరేందర్<br>శివమ్మ భర్త నరేందర్<br>రామచంద్రయ్య తండ్రి కొదండరాములు<br>తిర్పతమ్మ భర్త కోదండరాములు<br>అతినారపు చెన్ రాయుడు తండ్రి శంకరయ్య<br>అతినారపు శివమ్మ భర్త నిరంజన్<br>రాంచంద్రయ్య తండ్రి కోదండం<br>ఎ శ్రీరాములు తండ్రి శంకరయ్య<br>అతినారపు కృష్ణయ్య తండ్రి నారాయణ<br>అతినారపు తిర్పతమ్మ భర్త చంద్రయులు<br>అతినారపు జయమ్మ భర్త శ్రీరాములు<br>చిట్టగౌండ మల్లమ్మ భర్త పెద్ద మల్లయ్య<br>అతినారపు కృష్ణమ్మ భర్త తిర్పతయ్య | 91 | X-1 | 144 | X-1 | లేవు | లేవు | లేవు | లేవు |
| 8 | 96 | పట్టా | మెట్ట | 1.10 | మెర్గు కుర్మయ్య తండ్రి చంద్రయ్య (0.12)<br>గొకం పార్వతమ్మ భర్త వెంకట్ స్వామి (0.05)<br>మెర్గు రమా భర్త మాసయ్య (0.33)<br>తిక్కయ్య తండ్రి భగవంతు<br>మెరుగు కరుణాకర్ తండ్రి శ్రీను<br>మెర్గు ఐక్కయ్య తండ్రి నాగయ్య<br>మెర్గు భూపతయ్య తండ్రి నాగయ్య<br>మెరుగు చిట్టమ్మ భర్త శ్రీనివాసులు<br>మెర్గు సత్యనారాయణ తండ్రి మాసయ్య<br>మెర్గు మదుబాబు తండ్రి చంద్రయ్య<br>అనంతుల రమేష్ తండ్రి జగత్‌రెడ్డి<br>మెర్గు పుష్ప భర్త శ్రీను<br>ఎదుల అశోక్ కుమార్ తండ్రి బుగ్గన్న<br>మెర్గు లోకేష్ తండ్రి సత్యం | 94 | X-1 | 97 | 95 | లేవు | లేవు | లేవు | లేవు |
| 9 | 97 | పట్టా | మెట్ట | 0.31 | మద్దెల బాలమ్మ భర్త నర్సింహ్మా (0.10)<br>గోకం చిన్న లక్ష్మయ్య తండ్రి పొట్టయ్య (0.10)<br>గొకం గణేష్ తండ్రి పెద్ద లక్ష్మయ్య (0.11)<br>గొకం చెన్నయ్య తండ్రి బాలస్వామి<br>గొకారం శివ తండ్రి లక్ష్మయ్య<br>గొకం ఈశ్వరయ్య తండ్రి బచ్చయ్య | 94 | X-1 | 160 | 96 | లేవు | లేవు | లేవు | లేవు |
| | | మొత్తము | | 8.23 | | | | | | | | | |

భూసేకరణ చట్టం 30/2013 లోని సెక్షన్ 15 అనుసరించి పైన కనబరిచిన భూములకు సంభందించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు/ ఆక్షేపణలు లేనందున ఇట్టి రూఢి ప్రకటన చేయడమైనది.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్ కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ పిమ్మట ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడం గానీ, భూమి లేని వారిగా గాని జరగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరుపాధి మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

సం/- స్పెషల్ డిప్యూటి కలెక్టర్ (భూ.సే), యూనిట్–I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టరు నాగర్‌కర్నూల్
సం/- జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్

DIPR R.O.No.688/LA/ADVT/PUBLICATION/2026-27

**తెలంగాణ ప్రభుత్వము**
**జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)**
**నాగర్ కర్నూల్ జిల్లా**

**No.G2/991/2026** **తేది: 16.07.2026**
**Gaz. No. 109/2026**

**భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్ట పరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1) ప్రకారము**
**(భూసేకరణ, పునరావాసం మరియు పునర్వ్యవస్థీకరణలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం, 2013 లోని సెక్షన్ 11 మరియు సెక్షన్ 10–ఎ ప్రకారం మినహాయింపు పొందిన ప్రాజెక్టులకు)**
**(తెలంగాణ RFCTLARR నియమాలు, 2014 – రూల్ 6(12) ప్రకారం)**

**ఫారం (6)**
**ప్రాథమిక ప్రకటన**

తెలంగాణ ప్రభుత్వము **ప్యాకేజి నెం. 29 కర్నె తాండ లిఫ్ట్ యొక్క లట్టుపల్లి కెనాల్ మైనర్ 2ఆర్** ప్రజా ప్రయోజన ప్రాజెక్టు (పబ్లిక్ పర్పస్) అమలుకై నాగర్ కర్నూల్ జిల్లా, **బిజినపల్లి మండలము, లట్టుపల్లి** గ్రామ పరిదిలోని మొత్తం విస్తీర్ణం **0.03 గుంటలు** భూమిని భూసేకరణ చేయుటకు ఉద్దేశించినది.

భూసేకరణ, పునరావాసం మరియు పునర్వ్యవస్థీరకరణలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం, 2013 (RFCTLARR Act, 2013) G.O.Ms.No. 51, నీటిపారుదల శాఖ, తేది. 25.07.2017 ద్వారా ఈ ప్రాజెక్టును చాప్టర్ –II (Social Impact Assessment) మరియు చాప్టర్ – III (Food Security) నిబంధనల నుండి మినహాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినది.

పై ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మరియు RFCTLARR Act, 2013 లోని సెక్షన్ 11(1) ప్రకారం, జిల్లా కలెక్టర్ నాగర్ క్నూల్ జిల్లా తన ప్రొసీడింగ్స్ నెం. తేది.............. ద్వారా భూసేకరణ ప్రక్రియను ప్రాంభించుటకు ఆదేశించినారు.

అదేవిధంగా, సెక్షన్ 43(1) ప్రకారము అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గారిని ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి గాను మరియు, తెలంగాణ ప్రభుత్వము G.O.Ms.No. 139 ప్రకారము ప్రత్యేక ఉప కలెక్టర్ (ఎస్‌డిసి) గారిని భూసేకరణ అధికారిగా నియమించడమైనది. కావున, క్రింద షెడ్యూలులో పేర్కోన్న భూమిని పై ప్రజా ప్రయోజన ప్రాజెక్టు కొరకు భూసేకరణ చేయుటకు ఈ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయబడుచున్నది.

**షెడ్యూల్**

**గ్రామము: లట్టుపల్లి** **మండలం: బిజినపల్లి** **జిల్లా: నాగర్‌కర్నూల్**

| క్రమ సం. | సర్వే నెం. ఎస్.డి. నెం. | పట్టా / ఇనాం etc., | భూ వర్గీకరణ మెట్ట / ఆరుతడి / తరి | భూ సేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు/ ఎ.గుంటలు | పట్టాదారురు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల ఇతర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు చెట్ల పేర్లు | చెట్ల సంఖ్య | నిర్మాణములు వర్గము | విస్తీర్ణము |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 4 | 449 | పట్టా | మెట్ట | 0.03 | రాత్లవత్ మీట్య తండ్రి సేవ్య (0.03)<br>ముడావత్ బాల్య తండ్రి జగురామ్<br>ముడావత్ జహంగీర్ తండ్రి సూర్య<br>రాత్లావత్ కాల్య తండ్రి సేవ్య<br>ముడావత్ ముత్యాలి భర్త యం. కాల్య<br>ముడావత్ సూర్య తండ్రి జగురామ్ | 479 | 436 | 452 | 479 | లేవు | లేవు | బోరు పైపు లైన్ బావి | 1<br>1 |
| | | మొత్తం | | 0.03 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పున:స్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12 లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నాగర్ కర్నూల్ గారు, ప్రత్యేక ఉపకలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్ కర్నూల్, మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు ఇతర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవిలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 (1) ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్ కర్నూల్, గారి ఎదుట ఆభ్యర్ధనలు దాఖలు చేసుకోనవచ్చును.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో సీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్ కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ **G.O.Ms.No. 51,** తేది. 25.07.2017 ద్వారా భూసేకరణ, నష్టపరిహారము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము, 2013 లోని అధ్యాయము– II మరియు అధ్యాయము–III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.

సం/- స్పెషల్ డిప్యూటి కలెక్టర్ (భూ.సే), యూనిట్–I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టరు నాగర్‌కర్నూల్
సం/- జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్

DIPR R.O.No.664/LA/ADVT/PUBLICATION/2026-27

## హోర్ముజ్ సమీపంలో అమెరికా నావికుల్లో మానసిక సంక్షోభం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మధ్యప్రాచ్యంలో సుదీర్ఘకాలంగా సముద్రంలో విధులు నిర్వహిస్తున్న అమెరికా నౌకాదళ సిబ్బందిలో మానసిక ఒ త్తిడి తీవ్ర స్థాయికి చేరుకుంది. యూఎస్‌ఎస్ అబ్రహం లింకన్ విమా న వాహక నౌకలో పలువురు నావికులు సముద్రంలోకి దూకేందుకు ప్రయత్నించినట్లు అమెరికా సైనిక వ్యవహారాలపై రిపోర్ట్ చేసే ప్రత్యేక మీడియా సంస్థలు వెల్లడించాయి.సుమారు 5,000 మంది సిబ్బంది ఉన్న ఈ నౌక 250 రోజులకు పైగా నిరంతరంగా సముద్రంలో ఉంది. ఆధునిక కాలంలో విమాన వాహక నౌకకు ఇది రికార్డు స్థాయి. సాధారణంగా ఇలాంటి నౌకలకు క్రమం తప్పకుండా పోర్టు సందర్శనలు, విశ్రాంతి, సరఫరాల పునరుద్ధరణ వంటివి ఉంటాయి. అయితే ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో ఈ నౌకను పసిఫిక్ నుంచి మధ్యప్రాచ్యానికి మళ్లించి, నెలల తరబడి పోర్టుకు రాకుండా ఉంచడంతో పరిస్థితి తీవ్రమైంది.పని ఒత్తిడి, సరఫరాల కొరత, ఆహారం–నీటి సమస్యలు, పాతబడిన టాయిలెట్లు, హాట్ వాటర్ లేకపోవడం, కుటుంబాలకు దూరంగా ఉండటం వంటి అంశాలు సిబ్బంది మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు కుటుంబ సభ్యులు, అమెరికా చట్టసభ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. నేవీ టైమ్స్, స్టార్స్ అండ్ స్ట్రైప్స్ వంటి సైనిక ప్రత్యేక మీడియా నివేదికల ప్రకారం పలువురు నావికులు సముద్రంలోకి దూకేందుకు ప్రయత్నించగా, సహచరులు అడ్డుకున్నారు. ఒక సందర్భంలో నావికుడు నిజంగా సముద్రంలో పడి హెలికాప్టర్ సహాయంతో రక్షించబడ్డాడు.సాన్ డియాగోలో 200 మందికి పైగా కుటుంబ సభ్యులు నేవీ అధికారులతో సమావేశమై తమ బంధువుల మానసిక స్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు నావికులు "నేను రేపు లేవకపోతే బాగుంటుంది" అని కుటుంబాలకు సందేశాలు పంపినట్లు వెల్లడైంది.అయితే అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ ఈ నివేదికలను "పూర్తిగా తప్పుడు ప్రాతినిధ్యం"గా ఖండించారు. నౌకలోని సిబ్బందికి అవసరమైన సహాయం అందిస్తున్నామని, ప్రతి నౌక, ప్రతి సిబ్బందికి సాధ్యమైనంత మేర సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. నేవీ అధికారులు కూడా ఆత్మహత్యా యత్నాలు పెరిగినట్లు అధికారిక గణాంకాలు లేవని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, అబ్రహం లింకన్ సిబ్బందికి ఉపశమనం కల్పించేందుకు మరో విమాన వాహక నౌకను ఈ ప్రాంతానికి పంపించే చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఈ పరిణామాలు అమెరికా నౌకాదళంలో సుదీర్ఘకాల విధుల ప్రభావంపై తీవ్ర చర్చకు దారితీశాయి.

## తెలంగాణలో యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగార్థులకు తీపికబురు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగార్థులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. పోలీసు, ఫైర్, జైళ్లు, ఎస్పీఎఫ్, ఎక్సైజ్, ట్రాన్స్‌పోర్ట్, ఫారెస్ట్ శాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని మరో 2 రెండేళ్లు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఐదేళ్ల వయోపరిమితి పెంపు మే 18, 2026 నుంచి అమల్లో ఉండగా.. తాజాగా మరో రెండేళ్లు అదనంగా పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయా శాఖల్లో పోస్టులకు వయోపరిమితి పెంపు ఏడేళ్లకు చేరింది. ఈ నిర్ణయం ప్రస్తుతం పోలీసు రిక్రూట్‌మెంట్లకూ వర్తిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. నిరుద్యోగ యువత నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

## ఫిర్యాదు చేయండి

హైదరాబాద్(జనంసాక్షి):నేరాల స్వరూపం ఎప్పటిక ప్పుడు మారుతోందని తెలంగా ణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యా నించారు. సైబర్ నేరాల బారిన పడుతున్న వారిలో రిటైర్డ్ ఉద్యో గులే ఎక్కువగా ఉంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సురక్ష కా తిరంగా సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సురక్ష కా తిరంగా కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌ను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కల్పిస్తున్నామని డీజీపీ తెలిపారు.

## తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం

హైదరాబాద్,ఆగస్ట్14(జనంసాక్షి):తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం దక్కింది. 2026 స్వాతంత్య్రదినోత్సవం సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు ప్రకటించారు. విధి నిర్వహణలో చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం, విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పతకాలను ప్రకటించారు. ఇందులో 3 గ్యాలంట్రీ మెడల్స్, 2 విశిష్ట సేవా పతకాలు, 10 ప్రతిభావంతమైన సేవా పతకాలు ఉన్నాయి. వీరత్వానికి ప్రతీకగా అందించే గ్యాలంట్రీ మెడల్స్‌కు తెలంగాణకు చెందిన ముగ్గురు జూనియర్ కమాండోలు ఎంపికయ్యారు. బి. సత్యా రావు, కే. సందీప్ కుమార్, జే. వంశీకృష్ణ ఈ పతకాలను అందుకోనున్నారు. విధి నిర్వహణలో ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అసాధారణ తెగువకు గుర్తింపుగా వీరికి ఈ పురస్కారం దక్కింది.

## యూపీలో గోమూత్రంతో డెయిరీ

ఉన్నందున, తుది ప్రభుత్వ ధరను అధికారిక ప్రకటన ఆధారంగానే పరిగణించాల్సి ఉంటుంది.గోమూత్ర సేకరణ ద్వారా పశుపోషకులకు పాలతో పాటు అదనపు ఆదాయం కల్పించడం, పశుసంపదను ఆర్థిక కార్యకలాపాలతో అనుసంధానం చేయడం ఈ పైలట్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంటోంది. గ్రామీణ మహిళలను ఈ కార్యక్రమంలో భాగస్వాములుగా చేసి, సేకరణలో సహకరించే వారికి కమీషన్ ఇస్తున్నట్లు సమాచారం. దాదాపు 300 మంది మహిళలు ఈ ప్రక్రియలో పాల్గొంటున్నారు.ఈ కార్యక్రమంపై రాజకీయంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నప్పటికీ, పైలట్ ప్రాజెక్టు ఫలితాలను బట్టి భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే అంశంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. గోసంరక్షణతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఈ ప్రయోగం కొనసాగుతోంది.

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
15.08.2026

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# ప్రశ్నించడం నేరం కాదు.. అది విద్యార్థుల హక్కు

ప్రశ్నించే హక్కు ప్రజాస్వామ్యంలో ప్రజలకు రాజ్యాంగం ఇచ్చిన అత్యంత విలువైన హక్కు. ముఖ్యంగా న్యాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఒక రాజ్యాంగబద్ధమైన సంస్థ నిర్ణయాన్ని ప్రశ్నించడం నేరం కాదు. అది వారి విద్యా, ప్రజాస్వామ్య చైతన్యానికి నిదర్శనం. కానీ ప్రశ్నించినందుకు వారి భవిష్యత్తు వృత్తినే దెబ్బతీయాలని ప్రయత్నించడం మాత్రం అత్యంత ఆందోళనకరం.

నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయానికి చెందిన కొందరు విద్యార్థులు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను స్నాతకోత్సవానికి ఆహ్వానించవద్దంటూ లేఖ రాశారన్న కారణంతో, 2026 బ్యాచ్‌లోని విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేయవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా దేశంలోని బార్ కౌన్సిళ్లకు సూచించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయం. కొందరు విద్యార్థులు వ్యక్తం చేసిన అభిప్రాయానికి మొత్తం బ్యాచ్‌ను బాధ్యులను చేయడం న్యాయసూత్రాలకు, సహజ న్యాయానికి విరుద్ధం. ఇది కేవలం ఒక పరిపాలనా నిర్ణయం కాదు. విద్యార్థులకు ఒక ప్రమాదకరమైన సందేశాన్ని పంపే చర్య. "ప్రశ్నిస్తే మీ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది" అనే భయాన్ని న్యాయ విద్యార్థుల్లో నాటే ప్రయత్నంగా ఇది కనిపిస్తోంది. న్యాయాన్ని చదువుతున్న యువత ప్రశ్నించకూడదని, అధికారాన్ని ప్రశ్నిస్తే శిక్ష తప్పదని చెప్పడం న్యాయ విద్య యొక్క మౌలిక ఉద్దేశానికే విరుద్ధం.

ఇక్కడ అత్యంత ముఖ్యమైన అంశం ఏమిటంటే స్వయంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కూడా బీసీఐ జోక్యాన్ని వ్యతిరేకించినట్లు వచ్చిన వార్తలు. విద్యార్థులతో తనకు సంబంధించిన విషయంపై మరో సంస్థ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించడం గమనార్హం. తనను ఉద్దేశించి విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేసినప్పటికీ, వారి హక్కుల విషయంలో ఆయన తీసుకున్న వైఖరి ప్రజాస్వామ్య విలువలకు బలం చేకూరుస్తుంది.

న్యాయ విద్యార్థులు రేపటి న్యాయవాదులు మాత్రమే కాదు రేపటి న్యాయవ్యవస్థకు వెన్నెముకగా నిలిచే తరానికి ప్రతినిధులు. వారు న్యాయాన్ని ప్రశ్నించాలి, అధికారాన్ని ప్రశ్నించాలి, అన్యాయాన్ని ప్రశ్నించాలి. ప్రశ్నించకుండా కేవలం ఆదేశాలను అనుసరించే న్యాయవాదులు తయారైతే, అది న్యాయవ్యవస్థకు మేలు చేయదు. విద్యార్థుల అభిప్రాయం తప్పు అనిపిస్తే, దానికి సమాధానం అభిప్రాయంతోనే ఇవ్వాలి. చర్చతో ఎదుర్కోవాలి. అవసరమైతే నిబంధనల ప్రకారం విచారణ జరపాలి. కానీ వారి వృత్తి భవిష్యత్తును అడ్డుకునేలా సామూహిక శిక్ష విధించడం మాత్రం ఆమోదయోగ్యం కాదు.

ఒక విద్యార్థి అభిప్రాయంతో విభేదించడం ప్రజాస్వామ్యం. ఆ విద్యార్థి భవిష్యత్తును శిక్షించడం అధికార దుర్వినియోగం. న్యాయ విద్యార్థులు ఈరోజు ప్రశ్నించే హక్కును కోల్పోతే, రేపు సామాన్య పౌరుడి తరఫున కోర్టులో ఎవరు ప్రశ్నిస్తారు? అధికారాన్ని ప్రశ్నించే ధైర్యమే న్యాయవృత్తికి ప్రాణం. ఆ ధైర్యాన్ని అణచివేయడం ద్వారా న్యాయవ్యవస్థను బలోపేతం చేయలేం. అందువల్ల బీసీఐ తన నిర్ణయాన్ని వెంటనే పునఃసమీక్షించాలి. కొందరు విద్యార్థుల అభిప్రాయాలను మొత్తం బ్యాచ్‌పై మోపకూడదు. విద్యార్థులపై సామూహిక శిక్షను ఉపసంహరించుకోవాలి. వారి న్యాయవాద వృత్తిలో ప్రవేశించే హక్కుకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలి. నల్సార్ విద్యార్థుల ప్రశ్నించే హక్కుకు మద్దతు ఇవ్వడం అంటే కేవలం కొందరు విద్యార్థులకు మద్దతు ఇవ్వడం కాదు రేపటి న్యాయవ్యవస్థ స్వేచ్ఛకు, రాజ్యాంగ విలువలకు మద్దతు ఇవ్వడం. **ప్రశ్నించండి. విభేదించండి. వాదించండి. అదే ప్రజాస్వామ్యం. ప్రశ్నించినందుకు శిక్షించడం మాత్రం ప్రజాస్వామ్యం కాదు.**

# జెన్ జీ.. ఆధునిక సమాజపు సరికొత్త మేధోవర్గం

సమాజ గమనంలో సాంకేతిక విప్లవాలు సరికొత్త మానవ సంబంధాలను, వినూత్న సామాజిక వర్గాలను ఆవిష్కరిస్తాయి. తాత్విక కోణంలో.. 'జెన్ జీ' అనేది కేవలం ఒక నిర్దిష్ట వయసు సమూహమో లేదా ప్రాంతానికో పరిమితమైన తరం పేరో కాదు. అది ఆధునిక గ్లోబల్ సమాజంలో ఉద్భవించిన ఒక సరికొత్త "యువ మేధో వర్గం". గతంలో పారిశ్రామిక విప్లవాలు ఏ విధంగానైతే సాంప్రదాయ ఉత్పాదక వర్గాలకు జన్మనిచ్చాయో, నేటి ఆధునిక సాంకేతిక యుగం 'జెన్ జీ' అనే ఒక శక్తివంతమైన జ్ఞాన వర్గాన్ని ఆవిష్కరించింది. 'జెన్ జీ' అనే పదమే స్వయంగా ఒక అద్భుతమైన చారిత్రక, వైజ్ఞానిక నిర్వచనం. ముఖ్యంగా ఇక్కడ 'వర్గం' అన్నప్పుడు.. అందులో ఏ కులం, ఏ మతం, ఏ ప్రాంతం, ఏ భాష , ఏ వర్ణం అనే సంకుచిత వర్ణనలకు గానీ, విభజనలకు గానీ అస్సలు తావులేదు.

**పాత సామాజిక పరిమితుల సరిహద్దులు దాటి..**

గతంలో సమాజాన్ని కేవలం సాంప్రదాయ ఆర్థిక కోణాల్లో, పాత ఉత్పత్తి సంబంధాల పరిధిలోనే వర్గీకరించేవారు. నేటి జెన్ జీ తరానికి ఆనాటి పాత వర్గీకరణలను అంటగట్టి వారి విశిష్టతను సంకుచితం చేయకూడదు. బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఏ విధంగానైతే తన అసాధారణ తార్కిక జ్ఞానంతో, పరిశోధనా పటిమతో సరికొత్త "మేధావి వర్గం"గా ఎదిగి వ్యవస్థలను ప్రభావితం చేశారో, నేటి జెన్ జీ తరం అంతా సమష్టిగా ఒక వినూత్న "యువ మేధో వర్గం"గా రూపాంతరం చెందుతోంది. ఈ నూతన మేధో వర్గీకరణలో ఏ కులం, ఏ మతం, ఏ ప్రాంతం, ఏ భాష అనే భేదాలు లేవు; కేవలం జ్ఞానం, సార్వజనీన తర్కం , విజ్ఞానం మాత్రమే దీని ప్రాతిపదిక. అందుకే వీరు పాత తరం శ్రమ జీవుల వలె కాకుండా, మానవ ఆలోచనా విధానంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్న ఆధునిక విశ్వజనీన సమాజ వర్గం.



**ఆరో దశ సాంకేతిక విప్లవ శిశువులు**

మొదటి పారిశ్రామిక విప్లవం యాంత్రికీకరణతో మొదలైతే.. నేడు మనం "ఆరో దశ సాంకేతిక విజ్ఞాన యుగ పారిశ్రామిక విప్లవం"లో ఉన్నాము. ఈ దశ అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, క్వాంటం కంప్యూటింగ్, బయోటెక్నాలజీ వంటి అత్యంత సంక్లిష్టమైన విజ్ఞాన శాస్త్రాలతో ముడిపడి ఉంది. జెన్ జీ తరం ఈ విప్లవంలోనే జన్మించింది. వీరు పుడుతూనే అపరిమిత సమాచార ప్రపంచాన్ని, గ్లోబల్ కనెక్టివిటీని చూశారు. వీరికి సాంకేతికత అనేది నేర్చుకోవాల్సిన ఒక బాహ్య నైపుణ్యం కాదు, వారి దైనందిన జీవన సంస్కృతిలో అంతర్భాగం. సమాచారాన్ని క్షణాల్లో అందుకోవడం, విశ్లేషించడం, దానిని సమాజ ఉత్పాదకతవైపు మళ్లించడం వీరి నైజం. అందువల్లనే వీరు కేవలం శారీరక శ్రమకు పరిమితం కాకుండా, సాంకేతికతను శాసించే మేధో వర్గంగా అవతరించారు. ఈ సాంకేతిక విప్లవం ప్రపంచాన్ని ఒకే తాటిపైకి తేవడం వల్ల, ఈ వర్గంలో ఏ ప్రాంతీయ సరిహద్దులు గానీ,కుల వర్గ భాషా పరమైన అడ్డుగోడలు గానీ లేవు.

**అంబేద్కర్ మేధో తత్వ ప్రభావం**

బాబాసాహెబ్ అంబేద్కర్ మేధో తత్వానికి మూలస్తంభాలు – తర్కం, విమర్శనాత్మక ఆలోచన, సామాజిక సమానత్వం. నేటి జెన్ జీ తరంలో ఈ లక్షణాలు అంతర్జాతీయ ప్రమాణాలతో స్పష్టంగా కనిపిస్తాయి. వీరు సాంప్రదాయ సమాజం విధించిన ఆంక్షలను, పాత మూస పద్ధతులను, అసమానతలను తార్కికంగా ప్రశ్నిస్తారు. ప్రతి విషయానికి వెనుక ఉన్న సైన్స్, యదార్థాలను అన్వేషిస్తారు. సమాచార లభ్యత ఎక్కువగా ఉండడం వల్ల, వీరు ఏ ఒక్క సంకుచిత సిద్ధాంతానికో లేదా స్థానిక వ్యవస్థలకో లొంగిపోరు. అంబేద్కర్ ఎలాగైతే విజ్ఞానం ద్వారా సామాజిక విముక్తి సాధ్యమని నమ్మారో, జెన్ జీ తరం డిజిటల్ అక్షరాస్యత, సార్వజనీన జ్ఞానం ద్వారా ప్రపంచంలో తమ ఉనికిని చాటుకుంటోంది. మానవ హక్కులు, పర్యావరణ స్పృహ, లింగ సమానత్వం వంటి అంశాల్లో వీరి ఆలోచనలు ఆధునిక ప్రజాస్వామ్య విలువలకు అద్దం పడతాయి. ఇక్కడ కూడా జెన్ జీ ని అంబేద్కర్ మేధో వారసులుగా చూసినప్పుడు.. వారిలో ఏ కులం, ఏ మతం అనే వర్ణనలు అక్కర్లేదు; వారి ప్రశ్నించే విశ్వజనీన తత్వమే వారిని ఏకం చేస్తుంది.

**ఉపాధి రంగంలో సరికొత్త ఆవిష్కరణలు**

జెన్ జీ రాకతో ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగం, పని సంస్కృతి పూర్తిగా పునర్నిర్మించబడుతున్నాయి. సాంప్రదాయక కార్యాలయ పరిమితులను వీరు అధిగమిస్తున్నారు. 'గిగ్ ఎకానమీ', గ్లోబల్ ఫ్రీలాన్సింగ్ వైపు వీరు మొగ్గు చూపుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం చేతిలో ఉండడం వల్ల, వీరు చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయి స్టార్టప్‌లను స్థాపిస్తూ 'ఉద్యోగ సృష్టికర్తలు'గా మారుతున్నారు. సాంప్రదాయ డిగ్రీల కంటే 'సమకాలీన నైపుణ్యాల'కే వీరు ప్రాధాన్యత ఇస్తారు. ఉపాధి రంగంలో పాత పారిశ్రామిక సంబంధాలను మార్చి, సమాన భాగస్వామ్య సంస్కృతిని వీరు తీసుకువస్తున్నారు. ఈ గ్లోబల్ వర్క్ కల్చర్‌లో ఏ భాష మాట్లాడతారు, ఏ కులానికి లేదా ఏ ప్రాంతానికి చెందినవారనే తేడాలు లేకుండా.. కేవలం ప్రతిభ, నైపుణ్యాల ఆధారంగానే ఈ సరికొత్త వర్గం విశ్వ వ్యాప్తంగా విస్తరిస్తోంది.

**సరిహద్దులు లేని నూతన సంస్కృతి**

చారిత్రకంగా జెన్ జీ స్వభావం, సంస్కృతిపై వస్తున్న అంతర్జాతీయ విశ్లేషణలు వీరిని ప్రపంచ పౌరులుగా నిర్వచిస్తున్నాయి. వీరి సంస్కృతి ఏ ఒక్క దేశానికో, ప్రాంతానికో పరిమితం కాదు. డిజిటల్ మాధ్యమాలను వీరు కేవలం వినోదం కోసమే కాకుండా, ప్రపంచవ్యాప్త సామాజిక చైతన్యానికి, తమ గొంతుకను వినిపించడానికి ఒక శక్తివంతమైన ఆయుధంగా వాడుతున్నారు. పాత వ్యవస్థలు విధించిన సామాజిక నియంతృత్వాలను ఎదిరిస్తూ, స్వేచ్ఛా సంస్కృతిని వీరు అవలంబిస్తున్నారు. అందుకే ఈ సంస్కృతిని విశ్లేషించేటప్పుడు ఏ కుల-మతాల సాంప్రదాయాలు, ఏ ప్రాంతం యొక్క ఆచారాలు అనే వర్ణనలు అవసరం లేదు; ఇది పూర్తిగా సరిహద్దులు లేని ఒక ఆధునిక మానవతా సంస్కృతి. సమాజ భౌతిక నిర్మాణానికి పాత ఉత్పాదక వర్గాలు పునాది వేస్తే, జెన్ జీ వర్గం ఆధునిక సమాజ మేధో వికాసానికి దిక్సూచిగా నిలుస్తోంది. జెన్ జీ ని సంకుచిత సామాజిక వర్గ కోణాల్లో కాకుండా, సాంకేతిక యుగపు సరికొత్త జ్ఞాన శక్తులుగా గుర్తించాల్సిన అవసరం ఉంది. ఈ జెన్ జీ మేధో వర్గంలో ఏ కులం, ఏ మతం, ఏ ప్రాంతం, ఏ భాష అనే వర్ణనలకు తావులేదు; ఇది కేవలం మేధస్సు, ఆధునికత పునాదిగా ఏర్పడిన విశ్వజనీన తరం. అంబేద్కర్ చూపిన తార్కిక, మేధో మార్గంలో నడుస్తూ, ఆరో దశ సాంకేతిక విప్లవాన్ని చేజిక్కించుకుని, ప్రపంచ గమనాన్ని పునర్నిర్వచిస్తున్న ఈ సరికొత్త యువ మేధో వర్గమే రేపటి ప్రపంచాన్ని శాసించబోయే నిజమైన అంతర్జాతీయ శక్తి.



బిఎస్ రాములు
సామాజిక తత్వవేత్త
8331966987

## గర్వపడ్డ గోమాత

తాగునీరు లేని గూడెంలో తన మాత్రం తక్కువ ధరతో తగ్గించిన ప్రాణాంతకమైన రోగాలకి
పెద్దకూర తగాదాలో తనువు చాలించిన హిందూ ముస్లిము తమ్ముళ్ళ తలదన్నే త్యాగాలకి
ఈనాటికీ తలుపేలేని కూలిపోయే కోట్ల కొత్త పాకల్లో తాను తొలి అడుగేసిన ముహూర్తానికి
ముస్తాబైన గోశాలల్లో తమకో గది అడిగిన బిడ్డలొదిలిన వృద్ధ దంపతుల గంగ మునిగిన గౌరవానికి
సంధ్యా సమయంలో షికారుకెళ్తే సడలిన కాలుతో సాష్టాంగ నమస్కారంచేసిన
సొట్టబడ్డ సంత రోడ్డు గుంతలకి
తన పవిత్రమయిన పేడ పేరున పోలైన పనికిరాని పోటుగాళ్ళ పురివిప్పిన ఓట్లకి

ఎనభై వసంతాల పునరావిర్భవ భరత భూమి బుద్ధిలేని బాధ్యతకి

బిన్నత్వంలో ఏకత్వం చిన్నాభిన్నమయ్యే
ఒకే మత ఎజెండాతో ఎర్రకోటపై ఎగరబోయే
మూడు రంగుల జెండాని చూసి గోమాత గర్వపడింది.



నేపా సంతోష్ అచ్యుత్ కుమార్
అసిస్టెంట్ ప్రొఫెసర్
కాళోజీ ప్రతిభా పురస్కార గ్రహీత
8639442397

# 80 ఏళ్ల స్వాతంత్ర్యం.. స్వప్నాల భారతం ఎక్కడ?

భారతదేశం సర్వసత్తాక, సార్వభౌమ, ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా అవతరించిన తరువాత ఎనభై ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా దేశమంతటా జాతీయ పతాకాలు రెపరెపలాడాయి. వేదికలు అలంకరించబడ్డాయి. ప్రసంగాలు జరిగాయి. ప్రభుత్వ విజయగాథలు ఘనంగా వినిపించాయి. స్వాతంత్ర్య వేడుకల సందడి దేశమంతా కనిపించింది. అయితే ఈ సంబరాల మధ్యలో ఒకసారి మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం కోసం లక్షలాది మంది చేసిన త్యాగాల ఫలితం నిజంగా సామాన్యుడి జీవితంలో ప్రతిబింబిస్తోందా? ఎనభై ఏళ్ల ప్రజాస్వామ్య ప్రయాణం మనం కలలు కన్న భారతదేశాన్ని నిర్మించగలిగిందా? ఈ ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం వెతికితే సంబరాల కంటే ఆవేదనే ఎక్కువగా కనిపిస్తుంది.

దాదాపు రెండు శతాబ్దాల వలస పాలనలో భారత ప్రజలు అవమానాలు, దోపిడీ, అణచివేతను అనుభవించారు. స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటం కేవలం విదేశీ పాలకులను తరిమికొట్టడానికి జరిగిన పోరాటం కాదు. ప్రతి భారతీయుడికి గౌరవప్రదమైన జీవితం కావాలి, ఆకలి లేని సమాజం కావాలి, కుల వివక్ష లేని దేశం కావాలి, ఆర్థిక సమానత్వం కావాలి, అందరికీ విద్య, వైద్యం, ఉపాధి, న్యాయం అందాలి అన్న మహత్తర ఆకాంక్షలతో ఆ పోరాటం సాగింది. కానీ ఎనభై ఏళ్ల తర్వాత కూడా కోట్లాది మంది ప్రజలు కనీస అవసరాల కోసం పోరాడాల్సి వస్తున్న పరిస్థితి ఉంటే మన అభివృద్ధి నమూనాను పునఃపరిశీలించాల్సిందే.

మన దేశానికి వనరుల కొరత లేదు. అపారమైన మానవ వనరులు ఉన్నాయి. వ్యవసాయం, పరిశ్రమలు, విజ్ఞానం, సాంకేతికత, సంస్కృతి, చరిత్ర, ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రపంచంలో గర్వంగా నిలబడేందుకు కావాల్సిన అన్ని అవకాశాలు ఉన్నాయి. అయినప్పటికీ సమాజం కులం, మతం, ప్రాంతం, భాషల పేరుతో మరింతగా విడిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఒకరి బాధ మరొకరికి పట్టని పరిస్థితి పెరుగుతోంది. సామాజిక బాధ్యత స్థానంలో వ్యక్తిగత ప్రయోజనం, ప్రజా ప్రయోజనం స్థానంలో స్వార్థం, నైతికత స్థానంలో డబ్బు, సేవా భావం స్థానంలో అధికారం అనే ధోరణులు బలపడుతున్నాయి.

స్వాతంత్ర్యం వచ్చిన తొలి దశలో దేశాన్ని నడిపించిన నాయకత్వాన్ని గుర్తు చేసుకుంటే నేటి రాజకీయ పరిస్థితితో తేడా స్పష్టంగా కనిపిస్తుంది. మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, లాల్‌బహదూర్ శాస్త్రి, మౌలానా అబుల్ కలాం ఆజాద్,సరోజినీ నాయుడు, జయప్రకాశ్ నారాయణ వంటి నాయకులు కేవలం పదవుల కోసం రాజకీయాల్లోకి రాలేదు. దేశ భవిష్యత్తు పట్ల దూరదృష్టి, ప్రజల పట్ల బాధ్యత, త్యాగం, నిబద్ధత, విలువల పట్ల విశ్వాసం వారి రాజకీయ జీవితానికి పునాది. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికత, సామాజిక న్యాయం వంటి విలువలను దేశ నిర్మాణానికి కేంద్రంగా నిలబెట్టిన ఆ తరం నాయకత్వం మనకు గొప్ప వారసత్వాన్ని అందించింది. అయితే కాలక్రమంలో రాజకీయాల స్వరూపం మారిపోయింది. ముఖ్యంగా 1990ల తరువాత నేరచరిత్ర ఉన్నవారు, ఆర్థిక నేరాల ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు, డబ్బు మరియు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాల్లోకి వచ్చినవారు చట్టసభల్లోకి ప్రవేశించే పరిస్థితి పెరిగింది. ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగలుగా కాకుండా డబ్బు, మద్యం, కులం, మతం, ప్రలోభాలు, అబద్ధపు హామీల పోటీగా మారుతున్నాయన్న విమర్శను కొట్టిపారేయలేం. ఓటు విలువను డబ్బుతో కొలిచే స్థాయికి రాజకీయ సంస్కృతి దిగజారడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమైన పరిణామం. ప్రజల ఓటును



కొనుగోలు చేసి అధికారంలోకి వచ్చినవారు తిరిగి ప్రజలకే జవాబుదారులుగా ఉంటారా అన్నది పెద్ద ప్రశ్న.

అవినీతి విషయంలో కూడా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఒకప్పుడు అవినీతిపరుడిగా ముద్రపడటం రాజకీయంగా, సామాజికంగా అవమానంగా భావించేవారు. ఇప్పుడు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులే భారీ మెజారిటీలతో గెలుస్తున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. ప్రజా సంపదను దోచుకున్నారన్న ఆరోపణలు వచ్చినా రాజకీయ జీవితానికి పెద్దగా నష్టం కలగని పరిస్థితి ఏర్పడింది. బ్యాంకులను మోసం చేసి విదేశాలకు పారిపోయిన ఆర్థిక నేరస్తుల ఉదంతాలు దేశ ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. పార్టీలు మారినా, సిద్ధాంతాలు మారినా, అధికార సమీకరణాలు మారినా రాజకీయ ప్రయోజనాలు మాత్రం కొనసాగుతున్నాయన్న భావన ప్రజల్లో బలపడుతోంది. అయితే ఈ పరిస్థితికి పూర్తిగా రాజకీయ నాయకులనే నిందించి మన బాధ్యత నుంచి తప్పించుకోలేం. ప్రజాస్వామ్యంలో పాలకులను ఎన్నుకునేది ప్రజలే. డబ్బు తీసుకుని ఓటు వేస్తే, కులం లేదా మతం ఆధారంగా ఓటు వేస్తే, వ్యక్తిగత ప్రయోజనం కోసం ప్రజా ప్రయోజనాన్ని పక్కన పెడితే, ఆ తర్వాత అవినీతిపరుల పాలనపై ప్రశ్నించే నైతిక హక్కు మనం కోల్పోతాం. "మన కుటుంబం బాగుంటే చాలు, దేశం ఎలా ఉన్నా పర్వాలేదు" అనే ధోరణి ప్రజాస్వామ్యాన్ని లోపల నుంచి బలహీనపరుస్తుంది. సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా మారకపోతే రాజ్యాంగం ఎంత గొప్పదైనా దాని ఫలితాలు ప్రజల జీవితాల్లో పూర్తిగా కనిపించవు. ఇదే సమయంలో దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రమవుతోంది. చదువుకున్న యువత ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తోంది. రైతు తన పంటకు సరైన ధర కోసం పోరాడుతున్నాడు. నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు, పెరుగుతున్న సాగు ఖర్చులు రైతును అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. కార్మికుడు ఉపాధి భద్రత కోసం ఆందోళన చెందుతున్నాడు. పేద కుటుంబాలకు నాణ్యమైన విద్య, వైద్యం ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కొరత, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల లోపం, తల్లులు మరియు శిశువుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వంటి సమస్యలు అభివృద్ధి గణాంకాలకు అందని వాస్తవాలను గుర్తు చేస్తున్నాయి.

దేశం ఆర్థికంగా ఎదుగుతోందని గర్వంగా చెప్పుకోవడం తప్పు కాదు. ప్రపంచ వేదికపై భారతదేశం ఎదగడం ప్రతి భారతీయుడికీ గర్వకారణమే. కానీ ఆ అభివృద్ధి ఫలాలు చివరి వరుసలో నిలిచిన మనిషికి చేరుతున్నాయా అన్నదే అసలు ప్రశ్న. తాగడానికి సురక్షితమైన మంచినీరు లేని కుటుంబం ఉన్నప్పుడు, ఆకలితో బాధపడుతున్న పిల్లలు ఉన్నప్పుడు, చదువుకోవాలనే కోరిక ఉన్నా పేదరికం అడ్డుపడుతున్నప్పుడు, వైద్యం కోసం ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తున్నప్పుడు కేవలం భారీ ఆర్థిక గణాంకాలను చూపించి దేశం అభివృద్ధి చెందిందని చెప్పడం పూర్తి సత్యం కాదు. న్యాయవ్యవస్థలో పెండింగ్‌లో ఉన్న కేసులు కూడా సామాన్యుడి ఆవేదనకు అద్దం పడుతున్నాయి. సంవత్సరాల తరబడి కేసులు సాగితే న్యాయం ఆలస్యం అవుతుంది. ఆలస్యమైన న్యాయం చివరికి న్యాయాన్ని నిరాకరించినట్టే అవుతుంది. న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతూ జీవితకాలం గడిపే ప్రజలు ఉన్న దేశంలో న్యాయవ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇక ఎన్నికల సమయంలో ఉచిత హామీల పోటీ మరో సమస్యగా మారుతోంది. పేదలకు తాత్కాలిక ఉపశమనం కలిగించే సంక్షేమ పథకాలు అవసరమే. కానీ సంక్షేమం పేరుతో ఆర్థికంగా సాధ్యంకాని హామీలను ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయలేకపోవడం ప్రజలను మోసం చేయడమే అవుతుంది. ఉచితాల కంటే శాశ్వత ఉపాధి, నాణ్యమైన విద్య, అందుబాటులో వైద్యం, రైతుకు గిట్టుబాటు ధర, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై రాజకీయ పార్టీలు పోటీ పడాల్సిన సమయం వచ్చింది. ఎనభై ఏళ్ల స్వాతంత్ర్యాన్ని జరుపుకోవడం అంటే కేవలం జెండా ఎగురవేయడం కాదు. స్వాతంత్ర్యం కోసం త్యాగం చేసిన తరాల కలలను మనం ఎంతవరకు నెరవేర్చామో ఆత్మపరిశీలన చేసుకోవడం. ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఓటు వేయడం మాత్రమే కాదు, పాలకులను ప్రశ్నించడం, అవినీతిని ఎదిరించడం, ప్రజా సమస్యలపై స్పందించడం, రాజ్యాంగ విలువలను కాపాడటం కూడా. నాయకులు మారాలి. రాజకీయ సంస్కృతి మారాలి. అదే సమయంలో ప్రజల ఆలోచనా విధానం కూడా మారాలి. దేశ భవిష్యత్తు కేవలం పార్లమెంటులో కూర్చున్న నాయకుల చేతుల్లో లేదు. ప్రతి ఓటరు చేతిలో ఉంది. నిజాయితీగల నాయకత్వాన్ని గుర్తించి గెలిపించడం, నేరచరిత్ర మరియు అవినీతిని తిరస్కరించడం, కులం–మతం–డబ్బు ప్రలోభాలకు అతీతంగా ఓటు వేయడం ప్రజల చేతుల్లోనే ఉంది. ఎనభై ఏళ్ల స్వాతంత్ర్యాన్ని నిజమైన ప్రజాస్వామ్య ఉత్సవంగా మార్చాలంటే మనలోని నిర్లక్ష్యాన్ని, స్వార్థాన్ని, భయాన్ని వదిలి ప్రశ్నించే పౌరులుగా ఎదగాలి. స్వాతంత్ర్యం మనకు కేవలం విదేశీ పాలన నుంచి విముక్తిని ఇవ్వలేదు, ఒక గొప్ప రాజ్యాంగాన్ని, ఓటు హక్కును, సమానత్వం కోసం పోరాడే హక్కును, ప్రశ్నించే స్వేచ్ఛను కూడా ఇచ్చింది. ఇప్పుడు ఆ హక్కులను ఎంత బాధ్యతగా ఉపయోగిస్తున్నామన్నదే భారతదేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. జెండా ఎగురవేసి దేశభక్తి నినాదాలు చేయడం సులభమే. కానీ అవినీతిని తిరస్కరించడం, అన్యాయాన్ని ప్రశ్నించడం, పేదవాడి హక్కు కోసం నిలబడడం, ఓటును అమ్ముకోకపోవడం, రాజ్యాంగ విలువలను కాపాడడం అదే అసలైన దేశభక్తి.

ఎనభై ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత మనం అడగాల్సిన ప్రశ్న "దేశం ఎంత అభివృద్ధి చెందింది?" మాత్రమే కాదు. "ఆ అభివృద్ధిలో చివరి మనిషికి ఎంత భాగం దక్కింది?" అన్నదే. ఆ ప్రశ్నకు సమాధానం సంతృప్తికరంగా వచ్చే వరకు మన స్వాతంత్ర్య సంబరాలు సంపూర్ణం కావు. స్వాతంత్ర్య సమరయోధులు కలలు కన్న భారతదేశం ఇంకా మన ముందున్న లక్ష్యమే. ఆ లక్ష్యాన్ని సాధించే బాధ్యత పాలకులదే కాదు,ప్రతి పౌరుడిదీ. అదే నిజమైన స్వాతంత్ర్య స్ఫూర్తి. అదే భారత గణతంత్రం యొక్క అసలైన అర్థం.




మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు


# ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడిన కలం యోధుడు కుల్దీప్ నయ్యర్

**(ఆగస్టు 14, 1923 - ఆగస్టు 23, 2018)**

"కాలక్రమంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల్లో ఒక రకమైన భూస్వామ్య వర్గ చైతన్యం పెరిగిందని నేను భావిస్తున్నాను. భారతదేశానికి అవసరమైన ప్రజాసేవ స్ఫూర్తికి ఇది ఏమాత్రం సరిపోదు. ఉద్యోగంలో చేరిన తొలి రోజుల్లో ఉండే ఆదర్శవాదం కొన్నేళ్లకే క్రమంగా తగ్గిపోతుంది. చివరకు వారు వ్యవస్థలో ఒక భాగంగా మారిపోతారు."



భారత ప్రముఖ పాత్రికేయుడు, సిండికేటెడ్ కాలమిస్టు, మానవ హక్కుల కార్యకర్త, రచయిత, రాజకీయ వ్యాఖ్యాత, బ్రిటన్‌లో భారత మాజీ హైకమిషనర్ కుల్దీప్ నయ్యర్ చెప్పిన ఈ మాటలు నేటికీ ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. ప్రజాస్వామ్య విలువలు, పౌర హక్కులు, ప్రజాసేవపై ఆయనకు ఉన్న నిబద్ధత ఆయన సుదీర్ఘ ప్రజా జీవితంలో స్పష్టంగా కనిపించింది. 1947 సెప్టెంబర్ 13న సరిహద్దు దాటినప్పుడు మతం పేరుతో జరిగిన రక్తపాతం, విధ్వంసాన్ని తాను చూశానని కుల్దీప్ నయ్యర్ పేర్కొన్నారు. "మనం నిర్మించబోయే కొత్త భారతదేశంలో మతం, కులం పేరుతో మనుషులు చనిపోకూడదని అప్పుడే ప్రతిజ్ఞ చేశాను" అని ఆయన గుర్తుచేసుకున్నారు. మత, కుల భేదాలకు అతీతంగా సమానత్వంతో కూడిన భారతదేశమే ఆయన స్వప్నం. భారత రాజకీయాలు, ప్రజాస్వామ్యం, మానవ హక్కులపై దశాబ్దాల పాటు ఆయన తన రచనలు, వ్యాఖ్యానాల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించారు. ఎడమపక్ష రాజకీయ వ్యాఖ్యాతగా సుదీర్ఘకాలం కొనసాగిన ఆయన అధికారాన్ని ప్రశ్నించే ధైర్యానికి, ప్రజల పక్షాన నిలిచే నిబద్ధతకు ప్రతీకగా నిలిచారు. 1997లో రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ అయిన కుల్దీప్ నయ్యర్, బ్రిటన్‌లో భారత హైకమిషనర్‌గా కూడా సేవలందించారు. పాత్రికేయ రంగంలో, ప్రజా జీవితంలో ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా 2019లో మరణానంతరం పద్మభూషణ్ పురస్కారం లభించింది. మత, కుల విద్వేషాలకు తావులేని భారతదేశాన్ని కలలుగన్న ఈ మహనీయుడి ఆలోచనలు ప్రజాస్వామ్య విలువలకు చిరస్థాయి స్ఫూర్తి. ఆయన జయంతి సందర్భంగా కుల్దీప్ నయ్యర్‌కు ఘన నివాళులు.




## గూడే లేదు.. తిరంగా ఎక్కడ పెట్టాలి..?

# పొలంలో విగతజీవులైన తండ్రీకొడుకులు

- మోటారు నడపుతుండగా విద్యుద్ఘాతం
- బతుకు పోరులో తండ్రీకొడుకుల విషాదాంతం
- వ్యవసాయ కుటుంబంలో తీరని విషాదం





**కాటారం, ఆగస్టు 14 (జనంసాక్షి) :** వ్యవసాయ పొలానికి నీరు పెట్టేందుకు మోటారు నడపడానికి వెళ్లిన తండ్రి, కొడుకు విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన తీవ్ర కలకలం రేపింది. కటికోళ్ల బాపు (55), మనీష్ మనోజ్ కుమార్ (25) కుటుంబాన్ని పోషించేందుకు పొలాన్నే నమ్ముకున్న ఆ ఇద్దరి జీవితాలను విద్యుత్ మహమ్మారి కబళించింది. మోటారు వద్ద విద్యుత్ ప్రమాదం జరగడంతో తండ్రి, కొడుకు అక్కడికక్కడే కుప్పకూలి నారు. ఒకరిని కాపాడేందుకు మరొకరు ప్రయత్నించారా? లేక ప్రమాదం ఒకేసారి చోటుచేసుకుందా? అనే విషయాలపై అధికారులు విచారణ చేపట్టాల్సి ఉంది.

కళ్లముందే కుటుంబానికి అండగా ఉన్న ఇద్దరు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. రైతు కుటుంబానికి పంట కన్నా ప్రాణమే విలువైనదైనా.. నిర్లక్ష్యంగా ఉన్న విద్యుత్ వ్యవస్థ మరో కుటుంబాన్ని కన్నీటి మడుగులోకి నెట్టిందన్న ఆవేదన వ్యక్తమవుతోంది. వ్యవసాయ మోటార్ల వద్ద విద్యుత్ తీగలు, పరికరాల భద్రతపై అధికారులు తరచూ హెచ్చరికలు చేస్తున్నప్పటికీ ప్రమాదాలు కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనకు కారణాలు, విద్యుత్ భద్రతా లోపాలు ఏమైనా ఉన్నాయా అన్న దానిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కోరుతున్నారు. ఒకే కుటుంబానికి చెందిన తండ్రీకొడుకుల ప్రాణాలు బలైన ఈ విషాదం.. పొలంలో పంట కోసం చేసిన ప్రయత్నం చివరకు ఆ కుటుంబం జీవితాన్నే విషాదంలో ముంచింది. గంగారం గ్రామానికి చెందిన గ్రామస్తులు కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. పాపం బతుకు పోరులో చివరకు కుటుంబమే కూలిపోయింది. ఎంతో ఎదుగు ఎదగాల్సిన మనోజ్ కుమార్ బాల్యంలోనే రాలిపోయాడు. గ్రామస్తులు వారిని చూసి తట్టుకోలేక తరలిపోయారు.



# అధికారికంగా పండుగ సాయన్న జయంతి నిర్వహణ


- సీఎం సానుకూలత
- మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో సీఎంని కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ యోధుడు, ప్రజా నాయకుడు పండుగ సాయన్న జయంతిని అక్టోబర్ 22న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం నాయకులు సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించాలని, ఆయన సేవలు, పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేసేలా కార్యక్రమాలు చేపట్టాలని వారు ముఖ్యమంత్రిని కోరారు. అదేవిధంగా ముదిరాజ్ సామాజిక వర్గాన్ని ప్రస్తుతం ఉన్న బీసీ-డీ కేటగిరీ నుంచి బీసీ-ఏ కేటగిరిలోకి మార్చాలని కూడా ముఖ్యమంత్రికి విన్నవించారు. ముదిరాజ్ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముదిరాజ్ సంఘం నాయకుల విజ్ఞప్తులపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పండుగ సాయన్న జయంతి అధికారిక నిర్వహణతో పాటు ముదిరాజ్ సామాజిక వర్గం బీసీ-ఏ కేటగిరీకి మార్పు అంశాలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. ముదిరాజ్ సామాజిక వర్గం అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

# స్మార్ట్‌గా రేషన్‌కార్డు

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 14(జనంసాక్షి):** ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత స్మార్ట్‌గా మారు తోంది. ప్రభుత్వం పంద్రాగస్టు రోజు నుంచి సరి కొత్తహంగులతో పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డులను అందించడానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని మండలాల్లో ఇప్పటికే ముద్రణ పూర్తి చేసుకున్న స్మార్ట్ రేషన్ కార్డులు సిద్ధంగా ఉంచారు. నేడు సీఎం రేవంత్‌రెడ్డి సంగారెడ్డిలో జరిగే కార్యక్రమంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభిస్తారు. ఇందుకోసం జిల్లా కేంద్రంలో బహిరంగ సభను నిర్వహించి.. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు ఈ స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనున్నారు. సభా వేదిక, సభకు హాజరయ్యే వారికి కుర్చీలు, ఇతర సౌకర్యాలపై జగ్గారెడ్డి కలెక్టర్‌తో చర్చించారు. పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడ్లు.. ఇలా భద్రత పరమైన ఏర్పాట్లను ఎస్పీ పరితోశ్‌పంకజ్ పరిశీలించారు. సీఎం హైదరాబాద్ నుంచి హెలీక్యాప్టర్‌లో జిల్లాకు రానున్న నేపథ్యంలో తారా డిగ్రీ కాలేజీ హెలీప్యాడ్‌ను కూడా సందర్శించారు. సభకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు.





### చేతితో తడిమితే తెలిసే అక్షరాలు

'గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ'అనే పదాలను ఉబ్బెత్తుగా ముద్రించారు. చేతితో తడిమినప్పుడు ఈ అక్షరాలు స్పష్టంగా తెలుస్తాయి. అలాగే కార్డులో మైక్రో ప్రింటెడ్ టెక్స్ట్‌ను కూడా ఉపయోగించారు. అతి చిన్న పరిమాణంలో ఉండే ఈ అక్షరాలు సాధారణంగా కంటికి స్పష్టంగా కనిపించవు. పెద్దదిగా పరిశీలించినప్పుడు మాత్రమే చదవగలిగేలా ఉంటాయి. సాధారణ ప్రింటర్లతో నకిలీ చేయడం కష్టంగా ఉండటంతో ఇది యాంటీ-కాపీ భద్రతా అంశంగా పనిచేస్తుంది. 'గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ', 'ఒరిజినల్'వంటి అక్షరాలతో ద్వంద్వ రహస్య చిత్రాలను పొందుపరిచారు. నిర్దిష్ట కోణంలో చూసినప్పుడు లేదా పెద్దదిగా పరిశీలించినప్పుడు మాత్రమే ఇవి కనిపిస్తాయి. కార్డు అసలైనదో కాదో నిర్ధారించేందుకు నిపుణులకు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. అలాగే తెలంగాణ ప్రభుత్వ చిహ్నంతో వాటర్‌మార్క్‌ను కార్డులో పొందుపరిచారు. కార్డును వెలుతురుకు ఎదురుగా ఉంచినప్పుడు ఈ గుర్తు కనిపిస్తుంది. ప్రభుత్వ పత్రాల్లో సాధారణంగా ఉపయోగించే బలమైన ధ్రువీకరణ భద్రతా విధానాల్లో ఇది ఒకటి. అలాగే సాధారణ వెలుతురులో కనిపించని తెలంగాణ ప్రభుత్వ చిహ్నాన్ని అతినీలలోహిత (యూవీ) కాంతిలో కనిపించేలా ప్రత్యేక సిరాతో ముద్రించారు.

### జిల్లాకు వచ్చిన 4.46 లక్షల స్మార్ట్ కార్డులు

ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సులభతరం చేసేందుకు ప్రభుత్వం కార్డుదారులకు ప్రభుత్వం క్యూఆర్ కోడ్‌తో కూడిన పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయాలని నిర్ణయించిన విషయం విదితమే. రాష్ట్ర వ్యాప్తంగా 1.06 కోట్ల కుటుంబాలకు ఈ స్మార్ట్ కార్డులను అందించనున్నారు. ఏటీఎం కార్డు తరహాలో ఉండే ఈ కార్డు ముందు భాగంలో కుటుంబ యజమాని ఫొటో, కార్డు నెంబర్‌తో పాటు, క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే కార్డుదారుని కుటుంబ సభ్యుల సమగ్ర వివరాలు వస్తాయి. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 4.46 లక్షల మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. ఈ 4.46 స్మార్ట్ కార్డులు ఇప్పటికే సంగారెడ్డి జిల్లాకు చేరుకున్నాయి.

### ముగ్గురు సీఎంలను తెచ్చిన ఘనత జగ్గారెడ్డిదే..

సంగారెడ్డి అభివృద్ధి కోసం, పార్టీ కార్యక్రమాల కోసం ముఖ్యమంత్రులను మరియు ప్రముఖ జాతీయ నాయకులను తన నియోజకవర్గానికి రప్పించడంలో కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డి (తూర్పు జయప్రకాష్ రెడ్డి) ఆయన ముఖ్యమంత్రులను ఆహ్వానించడం తెలిసిందే. సంగారెడ్డి నియోజకవర్గంలో వివిధ సందర్భాల్లో హై-ప్రొఫైల్ పర్యటనలను మరియు ముఖ్యమంత్రుల రాకను సమన్వయం చేయడంలో జగ్గారెడ్డి తరచూ క్రియాశీలక పాత్ర పోషిస్తుంటారు. స్థానిక అభివృద్ధి నిధులు, ప్రభుత్వ పథకాల అమలు, జాతీయ నాయకులు లేదా ముఖ్యమంత్రుల పర్యటనల ద్వారా నియోజకవర్గానికి ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా ఆయన ఈ ఏర్పాట్లు చేస్తుంటారని ఆయన అనుచరులు చెబుతుంటారు. ఇప్పటికే జగ్గారెడ్డి కూతురు జయారెడ్డి నిశ్చితార్థంకు సీఎం రేవంత్ రెడ్డి హాజరైనారు. ప్రస్తుతం మరోసారి సీఎం రేవంత్‌రెడ్డిని సంగారెడ్డికి తీసుకవస్తున్నారు. డీసీసీ అధ్యక్షురాలు నిర్మలజగ్గారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతానికి శాయశక్తుల కృషి చేస్తున్నారు. ఎప్పటికప్పుడు అధికారులతో పర్యటన ఏర్పాట్లపై ఆరా తీస్తున్నారు.

## నేడు సంగారెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి

- ఇక్కడి నుంచే స్మార్ట్‌కు శ్రీకారం
- జిల్లాకు వచ్చిన 4.46 లక్షల స్మార్ట్ కార్డులు
- కొత్త కార్డుల జారీతో అక్రమాలకు అడ్డుకట్ట
- లబ్ధిదారులకు క్యూఆర్ కోడ్ స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీకి ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లా నుంచి భారీగా జన సమీకరణ
- సభ ఏర్పాట్లలో జగ్గారెడ్డి నిమగ్నం

## కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి ఫలాలు

### టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



కాంగ్రెస్ హాయంలోనే పేదలకు న్యాయం జరుగుతుంది. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజారంజక పాలన కొనసాగి స్తున్నాం. రాష్ట్ర పలు అభివృద్ధి ఫలాలను అందించేందుకు సంగారెడ్డి నుంచే శ్రీకారం చుట్టాం. వాటిని సంగారెడ్డి నుంచే రాష్ట్ర ప్రజలకు అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారు. సీఎం పర్యటన విజయవంతానికి మాశ్రేణులు కృషి చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సీఎం, మంత్రులకు ఘన స్వాగతం పలుకుతాయి.

## సీఎం సభకు సర్వం సిద్ధం



**సంగారెడ్డి ఆగస్టు 14 (జనం సాక్షి) :** సంగారెడ్డిలో శనివారం జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లు చేస్తున్నట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. సభ ఏర్పాట్లను డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డితో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. సీఎం బహిరంగ సభను లక్ష మంది తో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సభ విజయవంతం కోసం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామిలతో ప్రతిరోజూ సమీక్షిస్తున్నామని చెప్పారు. సంగారెడ్డి ఐబీ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ ప్రధానమంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ, రాజీవ్‌గాంధీల విగ్రహాలను ఆవిష్కరించనున్నారని తెలిపారు. సభకు వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జర్మన్ షెడ్లు ఏర్పాటు చేస్తున్నామని జగ్గారెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్, నాయకులు కిరణ్ గౌడ్, కూన సంతోష్, షఫీ హాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా జలాల కోసం పోరాటం కొనసాగిస్తాం

- మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నాయకులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి




**వనపర్తి బ్యూరో ఆగస్టు 14 (జనంసాక్షి) :** తెలంగాణ హక్కులను కాపాడుకోవడం కోసం అవసరమైతే ఎంతటి పోరాటానికైనా సిద్ధమని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. కృష్ణా జలాలను తెలంగాణకు దక్కకుండా ఆంధ్రప్రదేశ్ తరలించుకుపోతున్న విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించిన పోతిరెడ్డిపాడు ముట్టడి కార్యక్రమానికి రైతులు, రైతు కూలీలు, రైతు పక్షపాతులు, బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి సంఘీభావం తెలిపినందుకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రాంతానికి న్యాయంగా దక్కాల్సిన కృష్ణా జలాల విషయంలో నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. సాగునీటి కోసం తెలంగాణ రైతులు దశాబ్దాలుగా ఎదురుచూశారని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీటి రంగంలో సాధించిన పురోగతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

"రైతులు మరలబడితే మట్టికొట్టుకుపోవడం ఖాయం. తెలంగాణ హక్కులు హరిస్తే అంతు తెలుస్తుంది" అంటూ ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరించారు. తెలంగాణకు సంబంధించిన నీటి హక్కులను కాపాడుకునేందుకు రైతులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ చర్యనైనా ప్రశ్నించాల్సిందేనని స్పష్టం చేశారు. పోతిరెడ్డిపాడు వద్ద చేపట్టిన ముట్టడి కార్యక్రమానికి తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, రైతు కూలీలు, రైతు సంఘాల ప్రతినిధులు, రైతు పక్షపాతులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉప్పెనలా తరలివచ్చారని తెలిపారు. తెలంగాణ నీటి హక్కుల కోసం జరుగుతున్న పోరాటానికి ప్రజల నుంచి వచ్చిన స్పందన తమకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణకు న్యాయం జరగాలని, సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నీటి వాటా అందాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జలాల విషయంలో స్పష్టమైన వైఖరి అవలంబించాలని కోరారు. నీటి విషయంలో రాజీ పడకుండా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రజలు, రైతులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. పోతిరెడ్డిపాడు ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములైన ప్రతి రైతుకు, రైతు కూలీకి, రైతు పక్షపాతికి, బీఆర్‌ఎస్ శ్రేణులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన పాత్రికేయ మిత్రులకు కూడా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ హక్కులు, ముఖ్యంగా కృష్ణా జలాల విషయంలో ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగానికి సాగునీటి భద్రత కల్పించడమే లక్ష్యంగా భవిష్యత్‌లోనూ ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# సౌదీ కోర్టు ఖర్చుల కోసం రూ.40 వేల ఆర్థిక సాయం

- పరిహారం కేసు కోసం ఎన్నారై వ్యాపారవేత్త శంకర్ మద్దతు
- సీఎం ప్రవాసి ప్రజావాణిలో చెక్కు అందజేసిన స్టేట్ నోడల్ అధికారి విద్యాసాగర్




**హైదరాబాద్ (జనంసాక్షి) :** సౌదీ అరేబియాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి పరిహారం అందేలా కోర్టులో కేసు దాఖలు చేసేందుకు అవసరమైన ధ్రువపత్రాల అటెస్టేషన్, కోర్టు ఖర్చుల కోసం ప్రవాస భారతీయ వ్యాపారవేత్త ఆకునూరి శంకర్ రూ.40 వేల ఆర్థిక సహాయం అందించారు. జగిత్యాల జిల్లా, జగిత్యాల రూరల్ మండలం, అనంతారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు గుర్రం మహేష్ ఉపాధి కోసం మూడేళ్ల క్రితం సౌదీ అరేబియాకు వెళ్లాడు. సౌదీకి చేరుకున్న 45 రోజులకే, 2023 జూలై 6న అల్ హసా, హెఫూఫ్ ప్రాంతంలో సైకిల్‌పై వెళ్తుండగా కారు ఢీకొనడంతో మృతి చెందాడు. మహేష్ మృతి అనంతరం ఆయన కుటుంబానికి రావాల్సిన పరిహారం కోసం న్యాయపరమైన చర్యలు చేపట్టేందుకు అవసరమైన సహాయం కోరుతూ ఆయన భార్య పూజారాణి తన ఇద్దరు కుమార్తెలతో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం ప్రవాసీ ప్రజావాణికి వచ్చారు. ఆమె పరిస్థితిని తెలుసుకున్న ప్రవాస భారతీయ వ్యాపారవేత్త ఆకునూరి శంకర్ స్పందించి, పరిహారం కేసు దాఖలు చేయడానికి అవసరమైన ఖర్చుల కోసం రూ.40 వేల చెక్కును పూజారాణికి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ కె. విద్యాసాగర్, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్ అంబాసిడర్ డా. బి.ఎం. వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు చెన్నమనేని శ్రీనివాస రావు, సచివాలయం ఎన్ ఆర్ ఐ విభాగం అధికారి చిట్టీ బాబు, సీఎం ప్రవాసీ ప్రజావాణి లైజన్ ఆఫీసర్ భార్గవి నద్దునూరి, వాలంటీర్ కర్రి పద్మారాణి తదితరులు పాల్గొన్నారు.

### సీఎం ప్రజావాణిలో 135 దరఖాస్తులు

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం నిర్వహించిన 247వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 135 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ శాఖకు 30, బీసీ సంక్షేమ శాఖకు 22, సాధారణ పరిపాలన శాఖకు 15, ప్రవాసి ప్రజావాణికి 03, ఇతర శాఖలకు 65 దరఖాస్తులు అందాయి. ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏ సీ పీ ఉమేందర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎన్ ఆర్ ఐ సలహా మండలి చైర్మన్ బీ ఎం వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, సభ్యులు చెన్నమనేని శ్రీనివాస్ రావు, సమన్వయకర్త బొజ్జ అమరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తులు పంచుకున్నారు..

# తల్లిదండ్రులను ఆసుపత్రిలో వదిలేశారు!

- కన్న కొడుకుల నిర్దయకు కన్నీటి సాక్ష్యం... 80 ఏళ్ల దంపతులు...
- విషయం తెలిసిన వెంటనే స్పందించిన టిఆర్పీ పార్టీ నాయకులు....
- రోడ్లపై వదిలేయడం చాలా దారుణం : టిఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా



**కరీంనగర్ (జనంసాక్షి) :** వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు అండగా నిలవాల్సిన కొడుకులు.. ఆస్తులు పంచుకున్న అనంతరం తమకు భారంగా మారారని భావించి 80 ఏళ్ల వృద్ధ దంపతులను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వదిలేసి వెళ్లిన ఘటన మానవత్వాన్ని ప్రశ్నిస్తోంది. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో గన్ను మోహన్, గన్ను లక్ష్మి అనే 80 ఏళ్ల వృద్ధ దంపతులను వారి కొడుకు వదిలేసి వెళ్లి 24 గంటలు గడిచిన విషయం తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా దృష్టికి వచ్చింది. విషయం తెలిసిన వెంటనే స్పందించిన అఖిల్ పాషా పార్టీ నాయకులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని వృద్ధ దంపతులను పరామర్శించారు. అనంతరం వారి కొడుకులతో ఫోన్‌లో మాట్లాడి తల్లిదండ్రుల పరిస్థితిని వివరించి, వారిని నిర్లక్ష్యం చేయడం సరైనది కాదని సూచించారు. కరీంనగర్ పట్టణంలో ఉన్న పెద్ద కొడుకు వెంటనే అక్కడికి చేరుకొని మా తమ్ముడు ఇలాంటి దుర్ఘటనకు పాల్పడ్డ విషయం నాకు తెలియదని అంటూ నేను కిరాయికి ఉంటానని, నా ఇల్లు చాలా చిన్నదని, నాకు ఇబ్బందిగా ఉంటుందని పెద్దకొడుకు తెలియజేయడంతో వృద్ధ దంపతులకు తక్షణ రక్షణ, ఆశ్రయం కల్పించే ఉద్దేశంతో వారిని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమానికి తరలించి, ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అఖిల్ పాషా భావోద్వేగానికి గురయ్యి ఆయన మాట్లాడుతూ ఆస్తులు పంచుకోవచ్చు కానీ తల్లిదండ్రుల ప్రేమను, వారి ఋణాన్ని పంచుకోలేమని బాధపడ్డారు. వృద్ధ తల్లిదండ్రులను వదిలించుకోవడం కాదు వారి చివరి దశలో వారికి అండగా నిలవడం ప్రతి బిడ్డ బాధ్యత, మానవత్వం బతికిఉందా సచిపోయిందా అని ప్రశ్నించారు. తల్లిదండ్రులను గౌరవించడం ప్రతి ఒక్కరి కర్తవ్యం. వృద్ధులను నిర్లక్ష్యం చేసే ఘటనలు పునరావృతం కాకుండా సమాజం మొత్తం స్పందించాలని అఖిల్ పాషా అన్నారు. వృద్ధ దంపతులకు అవసరమైన సహాయం అందించేందుకు పార్టీ నాయకులు ముందుకు రావడం పట్ల పలువురు అభినందించారు. తల్లిదండ్రులను కన్నీళ్లతో కాకుండా, గౌరవంతో చివరి వరకు చూసుకోవాలని అఖిల్ పాషా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు జింక లావణ్య, రాష్ట్ర యూత్ సహాయ కార్యదర్శి మహబూబ్ అలీ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ, కార్యదర్శి ఇశ్రత్ శావాలి, నాయకులు గుండోజు సాధనందం, కోరే గంగ, గుండోజు పద్మ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
15 ఆగస్టు 2026

# సీఎం హామీలపై సమాధానం చెప్పాలి

● మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

**నారాయణఖేడ్, ఆగస్టు 14 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి సంగారెడ్డి జిల్లా పర్యటనకు వచ్చే ముందు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. గత మూడు సంవత్సరాల్లో సంగారెడ్డి జిల్లా, ముఖ్యంగా నారాయణఖేడ్ నియోజకవర్గానికి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో ముఖ్యమంత్రి ప్రజలకు వివరించాలని కోరారు. సభలు, సమావేశాలు నిర్వహించడం కంటే ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని అన్నారు. గత ఎన్నికల సమయంలో యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ మేరకు నారాయణఖేడ్ నియోజకవర్గానికి ఎన్ని ఉద్యోగాలు తీసుకొచ్చారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. తడ్కల్ మండల ఏర్పాటు కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చర్యలు చేపట్టి జీవోలు తీసుకొచ్చామని, ప్రభుత్వం మారిన తర్వాత ప్రక్రియ ముందుకు సాగలేదని ఆరోపించారు. తడ్కల్ మండల ఏర్పాటుపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని కోరారు.



### నల్లవాగు ప్రాజెక్టుపై స్పష్టత ఇవ్వాలి

నల్లవాగు ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటివరకు ఎంత నిధులు కేటాయించారో ప్రభుత్వం వెల్లడించాలని భూపాల్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టు అభివృద్ధి, సాగునీటి అవసరాలపై రైతులకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

### రైతు భరోసా, సంక్షేమ పథకాలపై లెక్కలు చెప్పాలి

రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేల హామీకి సంబంధించి ప్రస్తుతం ఎంత మొత్తం అందిస్తున్నారో, ఎంతమంది రైతులు లబ్ధి పొందుతున్నారో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. దళిత బంధు తరహా పథకాల విషయంలో కూడా ఇచ్చిన హామీలు, అమలు పరిస్థితి, లబ్ధిదారుల వివరాలను వెల్లడించాలని కోరారు. రేషన్ కార్డులను స్మార్ట్ కార్డులుగా మార్చడం వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను ప్రభుత్వం వివరించాలని, ప్రజలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే రేషన్ బియ్యం పరిమాణాన్ని పెంచి ఇవ్వాలని అన్నారు. ప్రజాధనాన్ని అనవసర కార్యక్రమాలకు ఖర్చు చేయకుండా సంక్షేమానికి వినియోగించాలని సూచించారు. సభలు, సమావేశాలు నిర్వహించడం మాత్రమే అభివృద్ధి కాదు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే నిజమైన పాలన. నారాయణఖేడ్ ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీపై ప్రభుత్వం ప్రగతి నివేదికను ప్రజల ముందు ఉంచాలి" అని భూపాల్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలపై ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయడంతో పాటు అవసరమైన నిధులు కేటాయించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు విశ్వసనీయమైన సర్వే సమాచారమే లక్ష్యం



**మెదక్ బ్యూరో, ఆగస్టు 14 (జనం సాక్షి) :** ప్రజలకు విశ్వసనీయమైన, కచ్చితమైన సర్వే సమాచారాన్ని అందించడమే లక్ష్యంగా పునఃసర్వే కార్యక్రమాన్ని నిర్వహించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సర్వే, భూ రికార్డుల శాఖకు చెందిన అధికారుల సమక్షంలో పునఃసర్వే పనుల కోసం నిర్దేశిత అర్హత, శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 20 మంది అర్హులైన అభ్యర్థులకు కలెక్టర్ ప్రతిమా సింగ్ లైసెన్సులను లాంఛనంగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డులను నవీకరించడం, మెరుగుపరచడం, భూముల సరిహద్దులను ఖచ్చితంగా నిర్ధారించడం, భూ యజమానులు, ప్రజలకు విశ్వసనీయమైన సర్వే సమాచారాన్ని అందించడం పునఃసర్వే ప్రధాన లక్ష్యమని తెలిపారు. లైసెన్స్ పొందిన సర్వేయర్లు సర్వే, భూ రికార్డుల శాఖ నిర్దేశించిన సాంకేతిక విధానాలు, నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పునఃసర్వే కార్యకలాపాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. సర్వేయర్లు తమ విధులను నిష్పక్షపాతంగా, కచ్చితత్వంతో, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పునఃసర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ ల్యాండ్ సర్వే కిషన్, సంబంధిత ల్యాండ్ సర్వే సిబ్బంది, లైసెన్స్‌డ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## కనకదుర్గ రైస్ మిల్లులో రూ.7.12 కోట్ల ధాన్యం గోల్‌మాల్

● ఓనర్‌పై కేసు నమోదు

**నవాబుపేట, ఆగస్టు 14 (జనం సాక్షి) :** మండలం పరిధిలోని తీగలపల్లి గ్రామంలో గల శ్రీ కనకదుర్గ పారా బాయిల్డ్ రైస్ మిల్లులో భారీ ఎత్తున వరి ధాన్యం మాయమైనట్లు సివిల్ సప్లైస్ అధికారులు గుర్తించారు. దీనికి కారణమైన మిల్లు ఓనర్ ధర్మారం కొట్టం సాయిబాబా రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 6వ తేదీన సివిల్ సప్లై అధికారులు సదరు రైస్ మిల్లులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మిల్లు రికార్డులకు, అక్కడ ఉన్న నిల్వలకు భారీ తేడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మిల్లులో సుమారు 49,149 వరి ధాన్యం బ్యాగులు (దాదాపు 1965 మెట్రిక్ టన్నులు) తక్కువగా ఉన్నట్లు లెక్క తేలింది. ఈ మాయమైన ధాన్యం కొరత విలువ సుమారు ఏడు కోట్ల పన్నెండు లక్షల 65 వేల రూపాయలు ఉంటుందని సివిల్ సప్లై అధికారులు అంచనా వేశారు. ఈ భారీ అక్రమంపై సివిల్ సప్లై డిపార్ట్మెంట్ అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు రైస్ మిల్ ఓనర్ ధర్మారం కొట్టం సాయిబాబా రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు.

# శిథిల భవనం..అధికారుల నిర్లక్ష్యం..!

- 30 ఏళ్ల మహిళా సంఘ భవనం శిథిలావస్థకు..
- చుట్టూ పిచ్చిమొక్కలే..ఎప్పుడు నేలమట్టం చేస్తారో?
- నూతన మహిళా సంఘం భవనం లేక అవస్థలు
- ఎదుర్కొంటున్న మహిళా సంఘం సభ్యులు


**మహమ్మదాబాద్, ఆగస్టు 14 (జనంసాక్షి) :** మహమ్మదాబాద్ మండల పరిధిలోని గాధిర్యాల్ గ్రామంలో సుమారు 30ఏళ్ల క్రితం నిర్మించిన మహిళా సంఘ భవనం శిథిలావస్థకు చేరుకుంది.భవనం పరిస్థితి రోజురోజుకూ అధ్వానంగా మారుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.భవనం చుట్టూ విపరీతంగా పిచ్చిమొక్కలు పెరిగి,పరిసరాలు పూర్తిగా అధ్వానంగా మారాయి.భవనం ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.శిథిలావస్థకు చేరిన భవనం వల్ల ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఇప్పటికే పూర్తిగా పాడైపోయిన ఈపాత భవనాన్ని పరిశీలించి,అవసరమైన చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రమాదకరంగా మారిన మహిళా సంఘ భవనాన్ని వెంటనే నేలమట్టం చేసి,స్థలాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.అధికారులు ఇకనైనా స్పందించి చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిందే.

### నూతన మహిళా సంఘం భవనం ఎప్పుడో..?

మహిళా సంఘాల కోసం ప్రభుత్వం నూతన భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.మండలంలోని 22గ్రామపంచాయతీలకు గాను21గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయి.కానీ గాధిర్యాల్‌లో మాత్రం ఇప్పటివరకు పనులు మొదలు కాలేదు.గ్రామ పంచాయతీ ఆధీనంలో 90కి పైగా మహిళా సంఘాల గ్రూపులు ఉన్నాయి.సమావేశాలు నిర్వహించేందుకు భవనం లేక ఎస్సీ కమిటీ హాల్,రచ్చకట్ట,సభ్యుల ఇళ్లలో పొదుపు సమావేశాలు నిర్వహించాల్సివస్తోంది.దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.అధికారులు స్పందించి వెంటనే నూతన మహిళా సంఘ భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని సభ్యులు కోరుతున్నారు.




### శిథిల భవనానికి త్వరలో మోక్షం..



గాధిర్యాల్ గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న మహిళా సంఘం భవనంపై జనంసాక్షి వివరణ కోరింది,మహమ్మదాబాద్ మండల ఎంపీడీవో నరేందర్‌రెడ్డి స్పందించారు. భవనాన్ని తొలగించేందుకు జిల్లా కలెక్టర్ అనుమతుల కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. అనుమతులు రాగానే శిథిలావస్థలో ఉన్న మహిళా సంఘం భవనాన్ని నేలమట్టం చేసేందుకు అవసరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

**మహమ్మదాబాద్ మండల్ ఎంపీడీవో నరేందర్ రెడ్డి**

## కొల్లాపూర్ పాలిటెక్నిక్ కళాశాలకు 70 పోస్టుల మంజూరు



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి) :** కొల్లాపూర్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు సంబంధించి మరో కీలక ముందడుగు పడింది. కళాశాల నిర్వహణ సజావుగా సాగేందుకు వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 70 నూతన పోస్టులు మంజూరు చేసినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.కొల్లాపూర్ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. మంజూరైన 70 పోస్టుల్లో బోధనా, బోధనేతర సిబ్బంది పోస్టులు ఉన్నాయని తెలిపారు.పోస్టుల మంజూరుతో కళాశాలలో విద్యాబోధనతో పాటు పరిపాలనా కార్యకలాపాలు కూడా సమర్థవంతంగా కొనసాగేందుకు అవకాశం ఏర్పడుతుందని మంత్రి అన్నారు. విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్యను అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. త్వరలోనే నియామకాలు, ఇతర ప్రక్రియలను పూర్తి చేసి కళాశాలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.కొల్లాపూర్‌లో పాలిటెక్నిక్ కళాశాలకు 70 పోస్టులు మంజూరు కావడం పట్ల విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత విద్యాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## మహబూబ్‌నగర్ జిల్లాలో ఏఎక్స్‌ఎల్ ఏఐ ఆధారిత ఎఫ్‌ఎల్‌ఎన్ విద్యకు అగ్రస్థానం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఆగస్టు 14 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్స్‌ఎల్ కృత్రిమ మేధస్సు ఫర్ ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని 2025 మార్చి 15న కేవలం 10 పాఠశాలలతో ప్రారంభించారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు మరియు విద్యాశాఖ అధికారుల సమిష్టి కృషితో 2025--26 విద్యా సంవత్సరంలో 49 పాఠశాలలకు ఈ కార్యక్రమం విస్తరించింది. ప్రస్తుతం 2026--27 విద్యా సంవత్సరంలో 79 పాఠశాలలు ఎక్స్‌ఎల్ కృత్రిమ మేధస్సు వేదికలో నమోదు కావడం విశేషం. కేవలం 10 పాఠశాలలతో ప్రారంభమైన కార్యక్రమం రెండేళ్లలో 79 పాఠశాలలకు చేరుకోవడం ద్వారా గొప్ప పురోగతి నమోదు చేసింది. జిల్లాలోని 17 మండలాల్లోనూ ఎక్స్‌ఎల్ కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రాథమిక అక్షరాస్యత, గణిత నైపుణ్యాల అభ్యసనాన్ని విస్తరించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతికత ఆధారిత అభ్యసన అవకాశాలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల ప్రాథమిక అక్షరాస్యత మరియు గణిత నైపుణ్యాల (ఎఫ్‌ఎల్‌ఎన్) అభ్యసనాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా అమలు చేస్తున్న ఎక్స్‌ఎల్ కృత్రిమ మేధస్సు ఫర్ ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా రాష్ట్రంలోనే విశిష్టమైన పురోగతిని సాధించింది. రాష్ట్రంలో అత్యధికంగా 79 ప్రభుత్వ పాఠశాలలు ఎక్స్‌ఎల్ కృత్రిమ మేధస్సు వేదికలో నమోదైన జిల్లాగా మహబూబ్‌నగర్ గుర్తింపు పొందింది. ఈ ఘనతపై జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి హర్షం వ్యక్తం చేస్తూ, ఎక్స్‌ఎల్ కృత్రిమ మేధస్సు వినియోగం మరియు పనితీరులో మహబూబ్‌నగర్ జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన అందరు మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులను ఆమె హృదయపూర్వకంగా అభినందించారు. రాష్ట్ర మండల విద్యాధికారుల సమావేశంలో కూడా మహబూబ్‌నగర్ జిల్లా ఎక్స్‌ఎల్ కృత్రిమ మేధస్సు పనితీరు మరియు వినియోగం ప్రత్యేకంగా ప్రశంసించబడిందని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. ఈ విజయం మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల సమిష్టి కృషి, అంకితభావం మరియు సమన్వయానికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. అలాగే, సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా, జిల్లాలో ఎక్స్‌ఎల్ కృత్రిమ మేధస్సు కార్యక్రమాన్ని అత్యుత్తమంగా అమలు చేస్తున్న ఉత్తమ పనితీరు కనబరిచిన ఎక్స్‌ఎల్ కృత్రిమ మేధస్సు పాఠశాలలను, అలాగే ఖాన్ అకాడమీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసించనున్నారు. ఇదే స్ఫూర్తితో ఎక్స్‌ఎల్ కృత్రిమ మేధస్సు కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా కొనసాగిస్తూ, విద్యార్థులు క్రమం తప్పకుండా కృత్రిమ మేధస్సు ఆధారిత అభ్యసన సెషన్లలో పాల్గొనేలా చూడాలని జిల్లా విద్యాశాఖాధికారి సూచించారు."సమిష్టి కృషితో మహబూబ్‌నగర్ జిల్లా విద్యారంగంలో మరింత ముందంజ వేయాలి. కృత్రిమ మేధస్సు ఆధారిత అభ్యసనాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మరింత మెరుగైన అభ్యసన అవకాశాలను అందించాలి" అని జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి ఆకాంక్షించారు.

## ప్రతి విద్యార్థిని ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి

● జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 14 (జనం సాక్షి) :** ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదవాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. ధన్వాడ మండలం కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, మైదా నం, మరుగుదొడ్లను పరిశీలించి మైదానంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని సర్పంచ్‌ను ఆదేశించారు. వినియోగం లో లేని మూత్రశాలను మరమ్మతులు చేసి విని యోగంలోకి తీసుకురా వాలని, 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించు కోవాలని సూచించారు.పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ గతేడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించిన వివరాలను తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థిని కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, మహిళా సాధికారతకు విద్య ఎంతో కీలకమని సూచించారు.పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్,మెనూ ప్రకారం అన్నం, వెజిటబుల్ కర్రీ, గుడ్డు,సాంబారు అందిం చకుండా కేవలం అన్నం ,సాంబారు మాత్రమే చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ అమలు చేయించని మెస్ ఇన్‌చార్జ్ కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

### నీట్, జేఈఈ విద్యార్థులకు దిశానిర్దేశం

అంతకుముందు గిరిజన గురుకులాన్ని కలెక్టర్ తనిఖీ చేసి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నీట్, జే ఈ ఈ మెయిన్స్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ నిన్నటి కంటే మెరుగ్గా చదవాలని, కష్టమైన సబ్జెక్టులను వాయిదా వేయకుండా ముందుగా సాధన చేయాలని సూచించారు.రోజువారీ చదువుకు టైమ్‌టేబుల్ రూపొందించుకుని క్రమశిక్షణతో చదవాలని, ఒక్క రోజును కూడా వృథా చేయకుండా పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని కలెక్టర్ ప్రియాంక సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా అధికారులు, గురుకుల ప్రిన్సిపాల్ ఎం. రాజారాం, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వంద మీటర్ల త్రివర్ణ పతాకంతో విద్యార్థుల ర్యాలీ



**హత్నూర, ఆగస్టు 14 (జనం సాక్షి) :** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రమైన హత్నూర, దౌల్తాబాద్ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమం కన్నుల పండుగగా సాగింది. వంద మీటర్ల పొడవైన త్రివర్ణ పతాకంతో వందలాది మంది విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు.ప్రధాన దారుల వెంట దారి పొడవునా మువ్వన్నెల పతాకాన్ని ప్రదర్శిస్తూ భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు.దౌల్తాబాద్ గాంధీ విగ్రహం వద్ద ప్రధాన కూడలిలో ఆవిష్కృతమైంది తిరంగా ర్యాలీ దృశ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.కార్యక్రమంలో ఎస్ఐ శ్రీధర్ రెడ్డి,పలువురు నాయకులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత, ప్రజాసేవలో నిర్లక్ష్యం సహించేది లేదు

● ఐడీఓసీలో కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆకస్మిక తనిఖీ

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి) :** ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉండటంతో పాటు ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలను అదనపు కలెక్టర్ బి. చెన్నయ్యతో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయాల్లో సిబ్బంది హాజరు, ఫైళ్ల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, పాత సామగ్రి, రికార్డుల భద్రత తదితర అంశాలను పరిశీలించారు. కార్యాలయాలు, మెట్ల మార్గాలు, స్టోర్‌రూమ్‌లు, పార్కింగ్ ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాల్లో అపరిశుభ్రత లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. చెత్త, పనికిరాని సామగ్రిని ఎప్పటికప్పుడు తొలగించాలని, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని ఆదేశించారు.కలెక్టరేట్ రికార్డు గదిని పరిశీలించిన కలెక్టర్.. ఏళ్ల తరబడి వినియోగంలో లేని రికార్డులను నిబంధనల ప్రకారం వర్గీకరించి, తొలగించేందుకు అర్హమైన వాటిపై ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో అవసరమయ్యే కీలక రికార్డులను సురక్షితంగా, క్రమబద్ధంగా భద్రపరచాలని సూచించారు. సర్వర్, ఎలక్ట్రికల్ రూమ్‌లలో పరికరాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జిల్లా ట్రెజరీ కార్యాలయాన్ని సందర్శించిన సమయంలో ఒక ప్రాంతంలో అపరిశుభ్రతను గుర్తించిన కలెక్టర్ వెంటనే శుభ్రం చేయాలని, అక్కడ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను చేపట్టాలని అధికారులను ఆదేశించారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో తనిఖీ సందర్భంగా బిజినపల్లి మండలం మంగనూరు గ్రామానికి చెందిన ప్రవళిక ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న కలెక్టర్.. ఆమెకు జన్మించిన చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై డీఎంహెచ్‌ఓను ఆరా తీశారు. చిన్నారికి అవసరమైన వైద్య సేవలు, ప్రభుత్వపరంగా అందాల్సిన సహాయం ఎలాంటి లోటుపాట్లు లేకుండా అందేలా చూడాలని, చిన్నారి ఆరోగ్యం, సంరక్షణను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అవసరమైన సమాచారం, సేవలు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరిశుభ్రత, కార్యాలయ నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, ప్రతి శాఖాధికారి తన కార్యాలయ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఈ తనిఖీలో డీఆర్వో పాండు, ఏవో చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఇంటి వెనుక గంజాయి మొక్కల పెంపకం

- వ్యక్తి అరెస్ట్.. రిమాండ్



**నస్పూర్(జనంసాక్షి):** నస్పూర్ పట్టణంలో ఇంటి వెనుక ఖాళీ స్థలంలో నిషేధిత గంజాయి మొక్కలను పెంచుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రెండు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామ్‌నగర్ (గాయత్రీనగర్) కు చెందిన బోడకుంటి ప్రభాకర్ (42) తన ఇంటి వెనుక ఉన్న ఖాళీ స్థలంలో గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు అందిన సమాచారం మేరకు సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ ఎస్సైపి-2 .జితేందర్ సింగ్ పోలీసు సిబ్బందితో కలిసి గురువారం మధ్యాహ్నం అక్కడికి చేరుకుని తనిఖీ చేపట్టామని తనిఖీల్లో ఇంటి వెనుక ఖాళీ స్థలంలో పెంచుతున్న రెండు గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకొని అనంతరం బోడకుంటి ప్రభాకర్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.ఈ కేసు దర్యాప్తును హాజీపూర్ పోలీస్ స్టేషన్ ఎస్సైపి డి.కిరణ్ కుమార్ చేపట్టారని దర్యాప్తు అనంతరం నిందితుడు ప్రభాకర్‌ను శుక్రవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.రవీందర్ తెలిపారు.

### గంజాయి సాగుపై ఉక్కుపాదం

నిషేధిత గంజాయి సాగు,విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ జి. రవీందర్ స్పష్టం చేశారు. నస్పూర్ పట్టణ పరిధిలో గంజాయి సాగు,విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ప్రజల దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు.

# సన్నబియ్యం చౌకబేరం!

- వెంకటాపూర్ మండలంలో డీలర్ల కుమ్మక్కు
- నగదు ఫార్ములాతో రేషన్ బియ్యం కొనుగోలు
- రాత్రికి రాత్రే మిల్లులకు తరలింపు
- సివిల్ సప్లై అధికారుల చర్యలు శూన్యం



**వెంకటాపూర్(రామప్ప ),ఆగస్టు 14(జనం సాక్షి):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో రేషన్ డీలర్ల హవా కొనసాగుతుంది. కొంతమంది డీలర్లు కుమ్మక్కై మండలంలో నగదు ఫార్ములాను అమలు చేస్తున్నారు. లబ్ధిదారులతో వేలిముద్రలు వేయించుకొని నగదు తో కొనుగోలు చేసిన రేషన్ బియ్యం తో తమ అక్రమ దందాను జోరుగా కొనసాగిస్తున్నారు.వెంకటాపూర్ మండలంలో మొత్తం 20 రేషన్ షాపులు ఉండగా,అందులో అంత్యోదయ, అన్నపూర్ణ, తదితర రేషన్ కార్డులు కలుపుకొని మొత్తం 11,914 ఉన్నాయి. కాగా,వాటిలో మొత్తం 33,886 మంది లబ్ధిదారులు ఉన్నారు.ఒక్కొక్క లబ్ధిదారునికి 6 కిలోలు చొప్పున (ఆగస్టు, సెప్టెంబర్,అక్టోబర్) నెలలకు కలిపి మొత్తం 6,29,926 కిలోల బియ్యాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ప్రభుత్వ బియ్యంతో ప్రైవేటు వ్యాపారానికి అలవాటుపడ్డ మండలంలోని కొంతమంది రేషన్ డీలర్లకు ప్రస్తుతం ఒకే నెలలో మూడు నెలలకు సంబంధించిన సన్నబియ్యం అప్పగించడంతో వారి పంట పండినట్లు అయింది.సివిల్ సప్లై అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో సదురు డీలర్లు ఆడింది ఆట..పాడింది పాట అన్న చందంగా మారింది .అడిగేవారు లేకపోవటంతో డీలర్లు లబ్దిదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని ఏకంగా రేషన్ షాపు నుంచే రాత్రికి రాత్రే ఆటోలల్లో సమీప రైస్ మిల్లులకు తరలించి కిలో కి రూ. 30 చొప్పున అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా సంబంధిత శాఖ అధికా రుల కళ్ళముందే జరుగుతున్న వారు మాత్రం తమకేమీ పట్టద న్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాం గం స్పందించి వెంకటాపూర్ మండలంలో కొంతమంది డీలర్లు చేస్తున్న అక్రమ దందాను అరికట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పలువురు ప్రతిపక్ష నేతలు హెచ్చరిస్తున్నారు.

# కరప్షన్ క్యాబినెట్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం

- బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, కమిషన్లతో కూరుకుపోయిందని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై వస్తున్న అవినీతి ఆరోపణలపై కేబినెట్‌లో చర్చించి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వాయిదా వేస్తోందని ఆరోపించారు. మంత్రులపై వచ్చిన ఆరోపణలపై ఆధారాలతో దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. చిన్న కాంట్రాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగులు అవినీతిపై ఏసీబీకి ఫిర్యాదు చేయాలని, వారికి బీజేపీ అండగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ అవినీతిని ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు 'హేట్ స్పీచ్' చట్టాన్ని ఉపయోగించడాన్ని బీజేపీ సహించదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న కుంభకోణాలు, మంత్రులపై ఆరోపణలపై చర్చించేందుకు తక్షణమే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, చిన్నయ్య, కౌన్సిలర్లు గంజి రాజు, శ్రీరామోజీ నరేష్, అర్జున్, ఈశ్వర్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# దుమ్ము ధూళితో బతకలేకపోతున్నాం

- దేవరాం పల్లిలో రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపి ఆందోళన



**కాటారం ఆగస్టు 14 (జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దేవరామ్ పల్లి వద్ద ప్రజలు రోడ్డు సక్రమంగా లేదని ఆందోళన కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం మంథని రహదారి వైపున గల దేవరాం పల్లి గ్రామం వద్ద రోడ్డు ప్యాచ్ వర్క్ పూర్తి కాకపోవడంతో దుమ్ము ధూళి విస్తరించి బతకలేకపోతున్నామని మెరుపు ఆందోళనకు దిగారు. గతంలో కూడా దుమ్ము దూళితో బతకలేకపోతున్నామని రోడ్ ఎక్కారు ధర్నా నిర్వహించారు. జంగాలపల్లి కాలనీ వాసులు ఇబ్బందులు పడుతూ ధర్నాలు చేస్తూనే ఉన్నారు. తాత్కాలికంగా వారానికి ఎన్ని రోజులు నీరు పట్టి తర్వాత వదిలేస్తున్నారు. కాంట్రాక్టర్, ఆర్ అండ్ బి అధికారులు స్పందించి పరిష్కార మార్గం చేయాలని గ్రామస్తులు ఆవేదన. ద్విచక్ర వాహనాలు, ఆటోలు రోడ్డుకు అడ్డంగా నేర్పి మహిళలు, ప్రజలు ధర్నా చేపట్టారు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో వాహనాల రాకపోకలు వల్ల దుమ్ము దూళితో అనారోగ్యం పాడిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు విన్నవించినప్పటికీ ఫలితం కానరావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో కిలోమీటర్ మేరా అటు దేవరాం పల్లి, గంగారం వైపున ఇటు ధన్వాడ, కాటారం వైపున బస్సులు, లారీలు, కార్లు ఇతర వాహనాలు భారీగా నిలిచిపోయాయి.



## వాయిపేట్‌లో జోరుగా వరినాట్లు

**సిరికొండ ఆగస్టు 14 (జనం సాక్షి) :** మండలంలోని పలు గ్రామాల్లో వరి నాట్లు ఊపందుకున్నాయి. ఇన్నాళ్లూ వర్షాభావ పరిస్థితులతో సాగునీరు లేక రైతులు వరి సాగుకు దూరంగా ఉన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చెరువులు, బావుల్లో నీటిమట్టం పెరగడంతో రైతులు సాగు పనులు ముమ్మరం చేశారు. చెరువులు, బావుల పరిధిలోని పొలాల్లో తొలుత వరి నాట్లు ప్రారంభించిన రైతులు.. తాజాగా వాయిపేటలో నాట్లను వేగవంతం చేశారు. నీటి లభ్యత పెరగడంతో ఈసారి వరి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# జిల్లాలో 1,39,116 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీకి సిద్ధం

- నేడు జిల్లా స్థాయిలో ప్రారంభం..
- లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి..
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో 1,39,116 పివిసి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో పివిసి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేపట్టాలన్నారు. జిల్లా స్థాయిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటలకు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస రెడ్డి, శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు ఐడీఓసీ కార్యాలయంలో ప్రారంభిస్తారని తెలిపారు. ప్రారంభం అనంతరం అన్ని మండలాల్లో పంపిణీ ప్రక్రియ చేపట్టాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను పూర్తి చేయాలని పౌర సరఫరాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు చేయాలి
- నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి) :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రేపు జరగబోయే 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా వేడుకలకు సంబంధించిన పోలీసు పరేడ్ మైదానం, ముఖ్యులు, ప్రజాప్రతినిధులు కూర్చునే స్థలాలు, సాంస్కృతిక ప్రదర్శనల విభాగాలు, తాగునీటి సరఫరా, విద్యుత్ వ్యవస్థ, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కార్యక్రమం, ఎటువంటి లోటుపాట్లు లేకుండా సజావుగా సాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కడ్తాల్ సమీపంలోని సాగర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించనున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. కార్డుల పంపిణీకి వచ్చే లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పనిచేసి వేడుకలు, పంపిణీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ పరిశీలనలలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, డిఈఓ భోజన్న, అగ్నిమాపక అధికారి శివాజీ, డిఎస్పీ శ్రీనివాస్, పౌర సరఫరాల అధికారి రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మసాగర్ జీపీలోనే కలపాలి

- నిజామగూడ, బోర్జగూడ గ్రామాల ప్రజల డిమాండ్
- డీపీఓకు వినతి



**సిరికొండ ఆగస్టు 14 (జనం సాక్షి) :** నిజామగూడ, బోర్జగూడ గ్రామాలను ధర్మసాగర్ గ్రామపంచాయతీ పరిధిలోకి తీసుకురావడంతో పాటు సిరికొండ మండల రెవెన్యూ పరిధిలోనే కొనసాగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు శుక్రవారం డీపీఓకు వినతిపత్రం అందజేశారు. గ్రామాలను పరిపాలనాపరంగా అనుసంధానం చేయడం వల్ల ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. తమ విజ్ఞప్తిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ మెస్రం జంగు, మాడా వి. హనుమంతు, సబలే సరిచంద్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ శామ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# కాజీపేట ఆర్ఓబీ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- పనుల జాప్యంలో అలసత్వాన్ని సహించేది లేదు
- కాజీపేట ఆర్ఓబీ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి
- పనుల జాప్యంలో అలసత్వాన్ని సహించేది లేదు
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**కాజీపేట ఆగస్టు 14 (జనంసాక్షి) :** కాజీపేట లో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం రోజున కాజీపేట లో కొనసాగుతున్న ఆర్ఓబీ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా, సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తూ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల జాప్యంలో అలసత్వాన్ని ఎంతమాత్రం సహించేది లేదని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా అధికారులు నిత్యం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ ఎస్ఈ సురేష్ బాబు, ఆర్ఓబీ నిర్మాణ పనుల పురోగతిని, ఇప్పటివరకు పూర్తయిన పనులు, కొనసాగుతున్న పనుల వివరాలను కలెక్టర్ కు వివరించారు. ఈఈ దేవిక, కాంట్రాక్టర్లు. తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ స్టార్ హాస్పిటల్‌లో ఘనంగా కార్డియా క్యాంపు




- మారిన జీవన శైలి లో భాగంగా ప్రతి ఒక్కరూ గుండె పరీక్షలు చేయించుకోవాలి
- ప్రముఖ డాక్టర్ అర్జున్ రెడ్డి ఎండి కార్డియా యశోద హాస్పటల్

**నర్సంపేట ఆగస్టు 14 (జనం సాక్షి) :** నర్సంపేట ప్రజలకు నాణ్యమైన గుండె వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో గ్రీన్ స్టార్ హాస్పిటల్‌లో యశోద హాస్పిటల్ సహకారంతో కార్డియా క్యాంపును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యశోద హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ ఎం.డి. కార్డియాలజిస్ట్ డాక్టర్ అర్జున్ రెడ్డి. ముఖ్య అతిథిగా హాజరై గుండె జబ్బుల నివారణ, ముందస్తు జాగ్రత్తలు మరియు ఆధునిక చికిత్సా విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్యాంపుకు వచ్చిన రోగులకు గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించారు. గుండె జబ్బులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని డాక్టర్ అర్జున్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ స్టార్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ లెక్కల విద్యాసాగర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా యశోద హాస్పిటల్ సహకారంతో మరిన్ని ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్డియా క్యాంపుకు ప్రజల నుంచి విశేష స్పందన లభించగా, పెద్ద సంఖ్యలో రోగులు హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు, డాక్టర్ ప్రవళిక, డాక్టర్ శివాని, డాక్టర్ క్రిస్టిన్, గ్రీన్ స్టార్ హాస్పిటల్ డైరెక్టర్లు శానబోయిన రాజకుమార్. గోనె యువరాజు, బీరం నాగిరెడ్డి, సుంకరి సంతోష్ రెడ్డి, సాంబాజి నాయుడు, శ్రీనివాస్, ఎండి జమాలుద్దీన్ పాల్గొన్నారు.

# రిజర్వాయర్ ద్వారా సాగు నీరు విడుదల చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 14 ( జనం సాక్షి ) :** స్టేషన్ ఘన్పూర్, చిల్పూర్ మండలాల పరిధిలో గల మల్లన్న గండి రిజర్వాయర్ కుడి కాలువ ద్వారా శుక్రవారం మాజీ ఉపముఖ్యమంత్రి,స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంట కాలువలకు నీటి పారుదల శాఖ అధికారులు, రెండు మండలాల ప్రజా ప్రతినిధులు, రైతులతో కలిసి సాగు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ లోని గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వ హించి పసుపు కుంకుమలు సమర్పించారు. స్వయంగా కుడి కాలువ గేట్లు లేపి నీటిని విడుద ల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం కరువు పరిస్థితులలో దేవాదుల ఎత్తిపో తల పథకం ఉమ్మడివరంగల్ జిల్లాకు వరప్రదాయ నిగా మారిందని తెలిపారు.ధర్మసాగర్,ఘనపూర్, మల్లన్న గండి, అశ్వరావుపల్లి, నవాబ్ పేట తో పాటు బొమ్మకూరు, చిటకోడూరు రిజర్వాయర్ ద్వారా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలకు సాధ్యమైనంతవరకు సాగు నీరు అందించే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని ఏ ప్రాజెక్టు నుండి కూడా సాగు నీరు విడుదల చేయడం లేదని కేవలం దేవాదుల ప్రాజెక్ట్ నుండి మాత్రమే పంటలకు సాగు నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. నెల రోజుల నుండి ప్రతీ రోజు దేవాదుల మోటార్ల ద్వారా పంపింగ్ పరిశీలిస్తూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ రిజర్వాయర్లలో నీటిని నింపడం వల్లే ప్రస్తుతం సాగునీటి విడుదల సాధ్యం అయిం దని అన్నారు. రిజర్వాయర్లలో 50శాతం వరకు నీటి నిలువలు ఉన్నాయని కావున ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో సాగు నీటి విడుదల చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. 15 రోజుల పాటు నీటి విడుదల చేసి మరో 15రోజులు రిజర్వాయర్ల లో నీటినినింపడం జరుగుతుందని వెల్లడించారు. పంట కాలువల ద్వారా వచ్చే నీటిని రైతులు పొదుపుగా వాడుకొని పంటలను కాపాడుకోవాల ని సూచించారు. ఆరుతడి పంటలు, ఇప్పటికే నాట్లు పూర్తి చేసి సాగు చేసుకున్న వరి పొలాలకు మాత్రమే నీటి వినియోగించుకోవాలని కొత్తగా వరి నాట్లు వేసి ఇబ్బందులు పడవద్దని విజ్ఞప్తి చేశారు. కాలువల ద్వారా వచ్చే నీటిని నిరూపయోగం కాకుండా ప్రజా ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు సమన్వయం చేసుకొని కాలువల వెంట పర్యవేక్షించాలని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగు నీరు అందించి పంటలను కాపాడటమే లక్ష్యంగా కృషిచేస్తున్నట్లు వెల్లడించా రు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్ రెడ్డి తాటికొండ, జిట్టెగూడెం ఫతేపూర్ సర్పంచులు మారపాక సృజన శ్రీనివాస్, బానోతు బాలు, గూగులోత్ లక్ష్మీ ఉమ్లా నాయక్, చిల్పూర్, ఘన పూర్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు చిర్రా నాగరాజు గౌడ్,జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, డిఈ సంపత్,ఏఈ సారా, నాయకులు బెలిదె వెంకన్న, రాపోలు మధుసూదన్ రెడ్డి, బేతి జయపాల్ రెడ్డి, గడ్డమీద సురేష్,రాజాక్ యాదవ్, బాబు, బానోతు రూప్లా నాయక్,పోశాల కృష్ణమూర్తి రవి, సంజీవ, వెంకటే ష్,నరసింహారెడ్డి,మారపాక వసంత్, ఐ సుధాకర్, చాడ రాజకుమార్,రాజు వివిధగ్రామాల సర్పంచు లు, నీటి పారు దల శాఖ అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
15 ఆగస్టు 2026

## ఎదులాపురం మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

- చైర్ పర్సన్ పోకబత్తిని అనిత



**ఖమ్మం రూరల్, ఆగస్టు 14 (జనం సాక్షి) :** ఎదులాపురం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత అన్నారు. శుక్రవారం ఖమ్మం రూరల్ మండలంలోని నాయుడుపేట సర్కిల్,కోదాడ క్రాస్‌రోడ్డు సర్కిల్ ప్రాంతాల్లో నూతన హంగులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రహదారులు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, సుందరీకరణ తదితర రంగాల్లో అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నామని పేర్కొన్నారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మున్సిపాలిటీకి నిధులు మంజూరు కావడంతో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయని అన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపించేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో మున్సిపాలిటీ మరింత అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు.అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమం లో మున్సిపాలిటీ కౌన్సిలర్లు వెంకట రెడ్డి, బానోత్ భాస్కర్, ఏఈ అప్పారావు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భార్యాభర్తల హత్య కేసును ఛేదించిన పోలీసులు

- సీసీటీవీ పుటేజి,సాంకేతిక ఆధారాలతో నిందితుల గుర్తింపు
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- జిల్లా ఎస్పీ కె.నరసింహ

**సూర్యాపేట, ఆగస్టు 14 (జనంసాక్షి) :** మోతె పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భార్యభర్తల జంట హత్యల కేసుకు సంబంధించి నేరానికి పాల్పడ్డ వారిని 24 గంటల్లోనే గుర్తించి అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు.మోతె మండల కేంద్రం జాతీయ రహదారి పక్కన మృతదేహాలను పాక్షికంగా పూడ్చిపెట్టారని గురువారం ఉదయం స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న వెంటనే కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, మునగాల సీఐ రామకృష్ణ రెడ్డి, ఎస్ఐ లచ్చిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని స్థానిక గ్రామ అధికారితో కలిసి మృతదేహాలను వెలికి తీసి గుర్తించడం జరిగిందన్నారు.సంఘటన స్థలాన్ని పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించినట్లు తెలిపారు.కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ రామకృష్ణా రెడ్డి, సీసీఎస్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టగా,అందుబాటులో ఉన్న సీసీటీవీ కెమెరాలు పరిశీలించగా రెండవ నిందితుడైన జిల్లేపల్లి సుందర్ మృతిచెందిన బూబాను తీసుకెళుతూ అనుమానాస్పదంగా కనిపించినట్లు తెలిపారు.దీని ఆధారంగా దర్యాప్తు చేస్తున్న మునగాల సీఐ ఆధ్వర్యంలో పోలీసు ప్రత్యేక బృందం శుక్రవారం ఉదయం సూర్యాపేట కొత్త బస్టాండ్ వద్ద మొదటి నిందితుడు షరీఫ్ ను, రెండవ నిందితుడు సుందర్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.వారిని విచారించగా నేరాన్ని అంగీకరించారని అన్నారు. మోతె గ్రామానికి చెందిన సుందర్, పోలీసు స్టేషన్ కు వచ్చే పంచాయతీలు చేస్తూ మొదటి నిందితుడు షరీఫ్ కు పరిచయం అయ్యాడని, సుందర్ ద్వారా హత్యకు గురైన నాగులు, బూబా భార్యాభర్తలు షరీఫ్ కు పరిచయం అయ్యారని చెప్పారు. బూబా నాగులు దంపతులకు షరీఫ్ 3 లక్షల రూపాయలు ఇచ్చాడని, ఈ డబ్బులు అడిగే క్రమంలో బూబా, నాగులు దంపతులు షరీఫ్ ను బెదిరించగా, వీరి అడ్డు తొలగించుకోవాలన్న పథకం ప్రకారం రెండవ నిందితుడు సుందర్ సహాయంతో హత్య చేసి పాతిపెట్టారని తెలిపారు.బూబా నాగుల అల్లుడు డబ్బుల కోసం ఇబ్బంది పెడుతున్నాడని, డబ్బులు సమకూర్చాలని బూబా నాగులు అభ్యర్థన మేరకు షరీఫ్ సుమారు 3 లక్షల రూపాయలు వారికి ఇవ్వడం జరిగిందన్నారు.తిరిగి ఇచ్చే క్రమంలో బూబా నాగులు డబ్బులు ఇవ్వకుండా, తిరిగి షరీఫ్ ను అట్రాసిటీ కేసులు పెడతామని బెదిరిస్తూ ఉండటంతో ఎలాగైనా వారి ఇద్దరినీ చంపేయాలని షరీఫ్ నిర్ణయించుకున్నాడని అన్నారు.ఈ నెల 11న రాత్రి ముందుగా షరీఫ్, సుందర్ లు తన మోటార్ సైకిల్ పై నాగులును ఎక్కించుకొని గ్రామ శివారు జాతీయ రహదారి సమీపంలో నాగులుతో గుంత తీయించే క్రమములో వెనక నుండి బండతో బలంగా తలపై మోదటంతో అదే గుంతలో నాగులు పడిపోగా, అతను చనిపోయాడని నిర్ధారించుకొని షరీఫ్ సుందర్ లు శవాన్ని పూడ్చి అక్కడి నుండి వెళ్ళిపోయారని అన్నారు.కొంత సేపటి తర్వాత బూబాను ఫోటో దిగాలని చెప్పి



అదే బైక్ పై అదే ప్రదేశానికి నమ్మించి తీసుకెళ్లి ఆమెను కూడా హతమార్చి గుంత తీసి, పాతి పెట్టె క్రమంలో ఆమె ఒంటిపై ఉన్న ఆభరణాలు కూడా తీసుకువెళ్లినట్లు తెలిపారు.దర్యాప్తులో పారదర్శకత కోసం కేసును సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్ కు అప్పగించగా,ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న మోతె పోలీస్ స్టేషన్ లో పని చేస్తున్న కానిస్టేబుల్ ఎండి షరీఫ్, జిల్లేపల్లి సుందర్ ను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి హత్యకు ఉపయోగించిన బండ, బైక్ , రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.నిందితులను విచారించగా నేరాన్ని అంగీకరించడం జరిగిందన్నారు.వారిని రిమాండ్‌కు తరలించటం జరుగుతుందన్నారు.ఈ కేసులో బాగా పని చేసిన కోదాడ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, స్థానిక ఎస్సై లచ్చిరెడ్డి, సిసిఎస్ ఎస్ఐలు సాయిరాం, హరికృష్ణ,సీసీఎస్ సిబ్బంది బాగా పనిచేశారని రివార్డ్స్ అందించి అభినందించారు.

# గిరిజన తండాల సర్వతోముఖాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- పెద్దగూడెం తండాల అభివృద్ధికి రూ.3 కోట్లు

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి) :** గిరిజన తండాల సర్వతోముఖాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 30 నెలల కాలంలో పెద్దగూడెం తండాల అభివృద్ధికి సుమారు రూ.3 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు తెలిపారు.పెద్దగూడెం తండాలో ఎమ్మెల్యే పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించడంతో పాటు రెండు మహిళా సమైక్య భవనాలను ప్రారంభించారు. అలాగే అంగన్వాడీ కేంద్ర భవనం పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన తండాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడం, మహిళా సంఘాలకు అవసరమైన వసతులు కల్పించడం, చిన్నారులకు మెరుగైన అంగన్వాడీ సౌకర్యాలు అందించడం, గ్రామపంచాయతీలకు సొంత భవనాలు నిర్మించడం ద్వారా తండాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

### విద్యార్థులతో ముచ్చటించిన ఎమ్మెల్యే

అనంతరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే



విద్యార్థులతో సుమారు 20 నిమిషాల పాటు ముచ్చటించారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వారికి వివరించారు. విద్యార్థులు ఉన్నత చదువులతో పాటు క్రీడా నైపుణ్యాలపై కూడా దృష్టి సారించాలని సూచించారు.

### ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభాకాంక్షలు

పెద్దగూడెం తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ ఆనందాన్ని ఎమ్మెల్యేతో పంచుకున్నారు. నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో సొంత ఇంటి కల నెరవేరిందని వారు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

### అనారోగ్యంతో ఉన్న కుటుంబ సభ్యులకు పరామర్శ

పెద్దగూడెం గ్రామ సర్పంచ్ పుష్పలత–శివకుమార్ తండ్రి లక్ష్మయ్య అనారోగ్యంతో ఉన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష్మయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అదేవిధంగా రొయ్యల శివయ్యను కూడా ఎమ్మెల్యే కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఏదైనా అవసరం ఉన్నా, సహాయం కావాలన్నా తనకు నిరభ్యంతరంగా తెలియజేయాలని, తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో తండా సర్పంచ్ వాల్య నాయక్, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదగిరిగుట్ట, ఆగస్టు 14 (జనంసాక్షి) :** శుక్రవారం యాదగిరిగుట్ట లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, పరీక్షలు, ప్రసూతి సేవలు, భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీకి విధులకు సంబంధించిన సిబ్బంది అందరూ హాజరయ్యారా లేదా, ఎవరైనా గైర్హాజరయ్యారా అని కలెక్టర్ ఆరా తీశారు.జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో కూడా నమోదైన వివరాలు పరిశీలించారు.సిబ్బంది మీ ప్రమాణం యాప్‌లో రోజువారీ హాజరు నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. విధులకు క్రమం తప్పకుండా హాజరై ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రతి నెల ఆసుపత్రి లో ఎన్ని డెలివరీ జరిగినవి అని , గత నెల, ఈ నెలలో ఎన్ని ప్రసవాలు జరిగియని, వాటిలో హైరిస్క్ గర్భిణులు ఎంతమంది ఉన్నారని తెలుసుకున్నారు. హైరిస్క్ గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలు, నిరంతర పర్యవేక్షణ, అవసరమైన చికిత్సలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో జరుగుతున్న సివిల్ పనులను పరిశీలించిన కలెక్టర్, ప్రస్తుతం పనులు ఎంతవరకు పూర్తయ్యాయి, మిగిలిన పనులను ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మనోహర్, డాక్టర్లు, సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

**మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 14 (జనం సాక్షి) :** ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తున్నట్లు డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్ర దినోత్సవాని పురస్కరించుకొని నేడు సీఎం రేవంత్ రెడ్డి సంగారెడ్డి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. క్యూఆర్ కోడ్ తో కూడిన ఆధునిక కార్డుల ద్వారా రేషన్ పంపిణీలో మరింత పారదర్శకత తీసుకురావచ్చని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో నూతన రేషన్ కార్డులు మంజూరు చేయలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ నిధులను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి పనిచేసేది






కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ను అవమానించేలా బిజెపి వ్యవహరించిందని ఆరోపించారు. మొదటినుంచి ఆ పార్టీ దళితుల పట్ల చిన్నచూపు చూస్తారని విమర్శించారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, డీసీసీ ఉపాధ్యక్షులు చంద్రకుమార్ గౌడ్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, కార్పొరేటర్ ఉమర్ కొత్వాల్ నాయకులు సాయిబాబా , నాగిరెడ్డి, రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల శారీరక, మానసిక ఆరోగ్యానికి ఫిట్‌నెస్ ఎంతో కీలకం

**వికారాబాద్, ఆగస్టు 14 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో పునరుద్ధరించిన జిమ్‌ను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ దీపక్ తివారీ శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ.. పోలీసు విధులు ఎంతో బాధ్యతాయుతమైనవని, నిరంతరం విధుల్లో అప్రమత్తంగా ఉండేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది శారీరకంగా దృఢంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండటం ఎంతో అవసరమని అన్నారు. ముఖ్యంగా ఫీల్డ్‌లో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితులు, అత్యవసర సమయాల్లో విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు మంచి ఆరోగ్యం, శారీరక దారుఢ్యం ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత,



ఉత్సాహం పెరుగుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. పునరుద్ధరించిన జిమ్‌ను పోలీసు అధికారులు, సిబ్బంది సద్వినియోగం చేసుకుని వ్యాయామాన్ని తమ రోజువారీ జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైనీ కలెక్టర్ సచిన్ బసవరాజ్ గుట్టూరు, ఐఏఎస్ , ఈఈ పీఆర్ ఉమేష్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు, సిబ్బంది మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాను పర్యాటకంగా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**మధిర, ఆగస్టు 14 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లాలోని సహజసిద్ధమైన నీటి వనరులు, చెరువులు, సరస్సులను పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి, జిల్లాను రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం బోనకల్, మధిర మండలాల్లో జిల్లా కలెక్టర్ పర్యటించి వివిధ పర్యాటక అభివృద్ధి ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బోనకల్ మండలంలోని కలకోట పెద్దచెరువు వద్ద పర్యాటక అభివృద్ధికి మంజూరైన పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి ప్రతిపాదనలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం మధిర మండలంలోని మడుపల్లి, మధిర ట్యాంక్ బండ్ ప్రాంతాలను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సందర్శించి, అక్కడ జరుగుతున్న పర్యాటక అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. కిచెన్, డైనింగ్ హాల్, టాయిలెట్ బ్లాక్ తదితర నిర్మాణ పనులను పరిశీలించి, నిర్మాణంలో ఉపయోగిస్తున్న సామగ్రి నాణ్యతను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యతలో ఎలాంటి లోపాలు తలెత్తినా సహించేది లేదని స్పష్టం చేశారు.మధిర రివర్‌ఫ్రంట్ అభివృద్ధి పనులను ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా సమగ్రంగా, ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా అభివృద్ధి పనులను రూపొందించాలన్నారు.



ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూలి, జిల్లాలో చేపట్టే ప్రతి పర్యాటక అభివృద్ధి కార్యక్రమం సహజ వనరుల పరిరక్షణకు అనుగుణంగా ఉండాలని అన్నారు. పర్యాటక అభివృద్ధి పేరుతో నీటి వనరులు, పర్యావరణానికి ఎలాంటి నష్టం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లాలో పర్యాటక రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా వినియోగించు కోవాల్సిన అవసరం ఉందన్నారు.మధిర ట్యాంక్ బండ్ పర్యాటక అభివృద్ధిలో భాగంగా రెండు కాటేజీలు, రిసెప్షన్, కిచెన్-- రెస్టారెంట్, విద్యుదీకరణ, టాయిలెట్ బ్లాక్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు చేపట్టిన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనులను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు.పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు.అదేవిధంగా కలకోట పెద్దచెరువు బండ్ విస్తరణ, పర్యాటక అభివృద్ధి కోసం +o1 తరహాలో మూడు కాటేజీలు, రిసెప్షన్, కేఫెటీరియా, పార్కింగ్, విద్యుదీకరణ, టాయిలెట్ బ్లాక్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన అందించాలని అధికారులను ఆదేశించారు.అభివృద్ధి పనులకు అవసరమైన భూమి అందుబాటులో లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఇంజినీరింగ్ పరిష్కారాలను అన్వేషించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైతే పర్యాటక అభివృద్ధి కార్యక్రమాల కోసం భూసేకరణ చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు.అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పర్యాటక అభివృద్ధి ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేసి అమలు దశకు తీసుకురావాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, పార్కింగ్, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, భద్రత వంటి మౌలిక సదుపాయాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు.జిల్లాలోని సహజసిద్ధమైన నీటి వనరులను పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి అనుసంధానం చేస్తూ, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరిగేలా, చిన్న వ్యాపారాలు అభివృద్ధి చెందేలా, స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదపడే విధంగా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ వెంట జిల్లా టూరిజం అధికారి బి. సుమన్ చక్రవర్తి, మధిర తహసీల్దారు రాంబాబు, బోనకల్ తహసీల్దారు, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్రీనివాసపురం బ్రిడ్జికి మోక్షం ఎప్పుడూ..?

- నత్తనడకన సాగుతున్న పనులు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- అంగవైకల్యంతో మరికొందరు
- లారీ డ్రైవర్ సమయస్ఫూర్తితో తృటిలో తప్పిన పెను ప్రమాదం



**హుజూర్‌నగర్ రూరల్, ఆగస్టు 14 (జనంసాక్షి) :** హుజూర్ నగర్ మండల పరిధిలో గల శ్రీనివాసపురం గ్రామానికి సమీపంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి కి మోక్షం ఎప్పుడు కలుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ కనీసం రహదారినైనా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయకపోవడం పట్ల వాహనదారులు, పాదచారులు, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు తెలియజేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 66 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 2022 సంవత్సరంలో మంజూరు చేయగా కాంట్రాక్టర్ పనులు నత్తనడకన చేస్తుండంతో బ్రిడ్జి నిర్మాణం పూర్తిస్థాయిలో నిర్మాణం కాలేదన్నారు. ఈ మార్గం ద్వారానే పరిసర గ్రామాల నుండి దాదాపు ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్ బస్సులు రాకపోకలు సాగాల్సి ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతిరోజు ఏం జరుగుతుందో, ఏ వార్త వినాల్సి వస్తుందోనని ఆందోళనగా ఉందన్నారు. ఈరోజు వరకు కూడా పూర్తిస్థాయిలో నిర్మాణం కాలేదన్నారు. పరిసర గ్రామాలు అమరవరం, అమర్ నగర్, అంజలిపురం, యాతవాకిళ్ళ, భీల్యా నాయక్ తండ రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం, తమ ట్రాక్టర్లతో ధాన్యాన్ని మిల్లులకు తరలించాలంటే ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుందన్నారు. ఆ బ్రిడ్జి పనులు నత్తనడకన జరగటం వలన గతంలో చాలామందికి అంగవైకల్యం సంభవించిదన్నారు. ఇప్పటికైనా అధికారులు ఆ కాంట్రాక్టర్ పై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు, పరిసర గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.




## విలీనానికి ఉబర్ - రాపిడో చర్చలు



**న్యూఢిల్లీ:**అమెరికా రైడ్ హెయిలింగ్ సంస్థ ఉబర్, భారత్‌కు చెందిన స్టార్టప్ కంపెనీ రాపిడో కలిసి విలీనం దిశగా అడుగులు వేశాయా? దేశీయంగా తమ కార్యకలాపాలను కలిసి నిర్వహించేందుకు చర్చలు జరిపాయా? అంటే అవుననే అంటున్నాయి సంబంధిత వర్గాలు. కానీ, యాజమాన్యం విషయంలో ఇరు సంస్థల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ డీల్‌కు బ్రేక్ పడినట్లు తెలిసింది. తాజాగా ఈ అంశం వెలుగులోకి వచ్చింది. ఉబర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి ఈ ఏడాది మే నెలలో ఐదు రోజుల పాటు భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. దేశంలో పెట్టుబడులు, వ్యాపార విస్తరణ ప్రణాళికలపై ఆయన వరుస సమీక్షలు జరిపారు. ఈ క్రమంలోనే రాపిడోతో విలీనం అంశం చర్చకు వచ్చినట్లు ఎకనమిక్ టైమ్స్ తెలిపింది. క్యాబ్, ఆటో, బైక్ ట్యాక్సీ సేవలందిస్తున్న ఇరు సంస్థలు కలిసి పనిచేయాలని ఉబర్ తొలుత ప్రతిపాదించింది. దేశీయంగా తమ కార్యకలాపాలను రాపిడో బృందమే నిర్వ హించాలని తన ప్రతిపాదనలో పేర్కొంది. అయితే, రాపిడో మాత్రం అందుకు పూర్తి భిన్నమైన ప్రతిపాదనతో ముందుకొచ్చింది. ఉబర్ భారత వ్యాపారాన్ని పూర్తిగా తమకు క్యాష్- స్టాక్ లావాదేవీ రూపంలో విక్రయించాలని పేర్కొంది. రాపిడోలో ఉబర్ మైనారిటీ వాటాదారుగా ఉండేలా ప్రతిపాదన తీసుకొచ్చింది. కానీ, భారత్‌లో తమ వ్యాపారాన్ని పూర్తిగా విక్రయించడం ఇష్టంలేని ఉబర్ ఇందుకు నో చెప్పింది. దీంతో డీల్‌కు బ్రేక్ పడినట్లు తెలిసింది.

### బ్యాకప్ లేకుండానే.. క్షణాల్లో కొత్త ఫోన్‌లోకి వాట్సప్ డేటా..

కొత్తగా స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసినప్పుడు.. చాలా మంది తమ పాత ఫోన్‌లోని వాట్సప్ చాట్‌లు, ఫొటోలను బ్యాకప్ చేయడానికి గూగుల్ డ్రైవ్ లేదా ఐక్లౌడ్ వంటి థర్డ్ పార్టీ బ్యాకప్‌లపై ఆధారపడుతుంటారు వాస్తవానికి ఈ డేటాను సులువుగా ట్రాన్స్‌ఫర్ చేయడానికి వాట్సప్ ఎప్పటి నుంచో చాట్ ట్రాన్స్‌ఫర్ ఫీచర్‌ను అందిస్తోంది. దీని గురించి అవగాహన లేక చాట్ హిస్టరీని బ్యాకప్ చేసి.. మళ్లీ కొత్తగా వాట్సప్‌ను ఇన్‌స్టాల్ చేసి రీస్టోర్ చేస్తున్నారు. దీనివల్ల మొబైల్ డేటా, సమయం రెండూ వృథా అవుతుంటాయి. వాట్సప్ అందించే చాట్ ట్రాన్స్‌ఫర్ వాడితే క్షణాల్లో మీ చాట్ కొత్త ఫోన్‌లో ప్రత్యక్షమవుతుంది. దీన్నెలా ఉపయోగించాలంటే? తొలుత పాత ఫోన్‌లో వాట్సప్ ఓపెన్ చేసి సెట్టింగ్‌లోకి వెళ్లాలి. అందులో చాట్స్ ఆప్షన్ క్లిక్ చేయాలి. ట్రాన్స్‌ఫర్ చాట్స్ ఆప్షన్ ఎంపిక చేసుకొని ూబిజీతీబి బటన్ నొక్కితే ఖీఖీ కోడ్ స్కానర్ ఓపెన్ అవుతుంది. ఆపై కొత్త ఫోన్లో మొదట వాట్సప్ ఇన్‌స్టాల్ చేసి ఓపెన్ చేయాలి. టర్మ్స్ అండ్ కండిషన్స్ యాక్సెప్ట్ చేయాలి. పాత ఫోన్‌లోని వాట్సప్ నంబరుతో కొత్త ఫోన్‌లో వాట్సప్ లాగిన్ అవ్వాలి. ఓటీపీతో వెరిఫై కావాల్సి ఉంటుంది. అప్పుడు స్క్రీన్‌పై డేటా ట్రాన్స్‌ఫర్ ఆప్షన్ కనిపిస్తుంది. దాన్ని క్లిక్ చేయగానే కొత్త ఫోన్ స్క్రీన్‌పై కనిపించే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి. రెండు ఫోన్లను కనెక్ట్ చేయాల్సిన అనుమతులను యాక్సెప్ట్ చేయాలి.

# నష్టాల్లో మార్కెట్ సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. హర్మూజ్ జలసంధి వద్ద నౌకల దిగ్బంధనం చేపడతామంటూ అమెరికా బెదిరించడం, చమురు ధరలు మళ్లీ పెరగడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఈ క్రమంలోనే సూచీలు రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొని ఈ వారాంతాన్ని నష్టాలతో ముగించాయి. సెన్సెక్స్ ఉదయం 77,903.43 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,079.96) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 77,684.37 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 71 పాయింట్లు నష్టపోయి 78,009.25 వద్ద ముగిసింది. నిఫ్టీ 29.85 పాయింట్ల నష్టంతో 24,366 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.43గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఏషియన్ పెయింట్స్, ఇండిగో, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎస్‌బీఐ షేర్లు నష్టపోయాయి. భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 87 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్స 4355 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**సెన్సెక్స్‌కు లాభం.. నిఫ్టీకి నష్టం**

ఆద్యంతం స్వల్ప శ్రేణిలో సాగిన ట్రేడింగ్‌లో, సెన్సెక్స్ లాభపడగా, నిఫ్టీ నష్టాల్లో ముగిసింది. ముడిచమురు అధిక ధరలు, భౌగోళిక రాజకీయ అనిశ్చితులతో మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి 12 పైసలు తగ్గి 95.45 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడిచమురు ధర 1.44% తగ్గి 87.70 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో కొరియా, జపాన్ లాభపడగా, షాంఘై, హాంకాంగ్ నష్టపోయాయి. ఐరోపా సూచీలు లాభాల్లో ట్రేడయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.71,000 కోట్లు పెరిగి రూ.492.88 లక్షల కోట్ల (5.17 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 145 పాయింట్ల లాభం (క్రితం ముగింపు 77,966.35 పాయింట్ల)తో 78,111.91 వద్ద ప్రారంభమైంది. రోజులో ఎక్కువ భాగం నష్టాల్లోనే ఉన్న సూచీ, ఇంట్రాడేలో 77,665.89 వద్ద కనిష్ఠాన్ని తాకింది. ఆఖర్లో పుంజుకోవడంతో చివరకు 113.61 పాయింట్లు పెరిగి 78,079.96 వద్ద ముగిసింది. నిఫ్టీ మాత్రం 40.10 పాయింట్ల నష్టంతో 24,395.85 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,311.40- 24,431.60 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 19 రాణించాయి. ఇండిగో 2.86%, ఎన్‌టీపీసీ 2.01%, బీఈఎల్ 1.98%, ఎల్ అండ్ టీ 1.95%, హెచ్‌యూఎల్ 1.72%, ఎటర్నల్ 1.60%, టెక్ మహీంద్రా 1.54%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.54%, ఏషియన్ పెయింట్స్ 1.13% లాభపడ్డాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 1.26%, టైటన్ 1.08%, రిలయన్స్ 0.80%, అల్ట్రాటెక్ 0.73% నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. స్థిరాస్తి 1.46%, ఎఫ్ఎమ్‌సీజీ 0.97%, సేవలు 0.89%, పరిశ్రమలు 0.83%, ఫోకస్డ్ ఐటీ 0.65% మెరిశాయి. లోహ, కమొడిటీస్, బీమా, ఇంధనం నిరాశపరిచాయి. బీఎస్ఈలో 2190 షేర్లు నష్టపోగా, 2141 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 225 షేర్లలో ఎటువంటి మార్పులేదు. ఐనాక్స్ క్లీన్ ఎనర్జీలో రూ.1500 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ గ్రూప్ ప్రకటించింది. ఇప్పటికే కంపెనీ రూ.1000 కోట్లను సీసీడీల రూపంలో పొందింది. వీటిని ఇతర కంపెనీల కొనుగోలు, సౌర విద్యుత్ ప్లాంట్ల విస్తరణకు వినియోగించనున్నారు. అమెరికాకు చెందిన హైపర్‌స్కేలర్ నుంచి డేటా కేంద్రం ప్రాజెక్టు పనుల కోసం 131 మిలియన్ డాలర్ల (రూ.1240 కోట్లు) ఆర్డరు లభించినట్లు ఎస్సార్ గ్రూప్ ఐటీ సంస్థ బ్లాక్ బాక్స్ తెలిపింది. గజా క్యాపిటల్ బ్రాండ్‌ను నిర్వహించే గజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ రూ.550 కోట్ల ఐపీఓ ఈనెల 19న ప్రారంభమై 21న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణి రూ.152-160. గరిష్ఠ ధర ప్రకారం.. కంపెనీ మార్కెట్ విలువ రూ.2256 కోట్లుగా నమోదుకావొచ్చు. ఐపీఓ ద్వారా రూ.3,000 కోట్ల నిధులు సమీకరించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేసినట్లు ముత్తూట్ పప్పాచాన్ గ్రూప్ సంస్థ ముత్తూట్ ఫిన్‌కార్ప్ తెలిపింది. పుంజుకున్న టాటా గ్రూప్ షేర్లు: టాటా సన్స్ ఛైర్మన్‌గా వైదొలగనున్నట్లు ఎన్.చంద్రశేఖరన్ ప్రకటించడంతో బుధవారం నష్టపోయిన టాటా గ్రూప్ షేర్లు.. గురువారం కోలుకున్నాయి. బీఎస్ఈలో టాటా టెక్నాలజీస్ 3.26%, టాటా కన్స్యూమర్ 2.74%, టీఎంపీవీ 1.68%, టాటా ఎలెక్సీ 1.36%, టాటా కమ్యూనికేషన్స్ 1.28%, ట్రెంట్ 1.08%, టీసీఎస్ 0.99%, టాటా పవర్ 0.53% పెరిగాయి. సీఎస్ఆర్ వ్యయాలు రూ.994 కోట్లు: ఐసీఐసీఐ బ్యాంక్: గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.994 కోట్లు ఖర్చు చేసినట్లు ఐసీఐసీఐ బ్యాంక్ ప్రకటించింది. 2024-25లో వెచ్చించిన రూ.801 కోట్లతో పోలిస్తే ఇవి 24% ఎక్కువ. 2026 మార్చికి దేశవ్యాప్తంగా 1.98 కోట్ల మందికి ఐసీఐసీఐ ఫౌండేషన్‌తో లబ్ధి చేకూర్చినట్లు వివరించింది. టాటా మెమోరియల్ సెంటర్‌కు విశాఖపట్నం, నవీ ముంబయి, పంజాబ్‌ల్లో ఉన్న క్యాన్సర్ కేర్ బ్లాక్‌ల కోసం రూ.1800 కోట్లు కేటాయించినట్లు బ్యాంక్ వెల్లడించింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,54,236 | ₹ 1,67,180 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,40,000

## సబ్‌స్క్రిప్షన్‌లో షిప్ 'రాకెట్'

ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ షిప్‌రాకెట్ ఐపీఓకు (ాప్ష్రతిజూతీనీఇ-ఎవబి ఎఖూ) అనూహ్య స్పందన లభించింది. మూడో రోజు సబ్‌స్క్రిప్షన్ నేటితో పూర్తవ్వగా.. దాదాపు 100 రెట్ల సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. 9.44 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా.. ఏకంగా 937 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. టెమాసెక్ పెట్టుబడులున్న ఇ-కామర్స్ షిప్‌రాకెట్ రూ.1617.5 కోట్లు సమీకరించే ఉద్దేశంతో పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. ధరల శ్రేణిని రూ.92-97గా నిర్ణయించింది. ఆగస్టు 12న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కాగా.. నేటితో ముగిసింది. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.727 కోట్లు సమీకరించింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల కేటగిరీ 122.8 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. నాన్-ఇన్‌స్టిట్యూషనల్ కేటగిరీ 88.9 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. రిటైల్ ఇన్వెస్టర్ల కేటగిరీ 46 రెట్లు సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. షిప్‌రాకెట్ గ్రే మార్కెట్ ప్రీమియం కూడా బలంగా ఉంది. దాదాపు 38 శాతం ప్రీమియంతో ట్రేడవుతోంది. ఈ ట్రెండ్ ప్రకారం ఒక్కో షేరుపై రూ.37 లాభంతో రూ.134 వద్ద షేర్లు లిస్టయ్యే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయి. ఆగస్టు 19న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో షేర్లు లిస్ట్ కానున్నాయి.

## వ్యక్తులకు రూ.5 కోట్లు.. సంస్థలు, ట్రస్టులకు రూ.20 కోట్లు

### అక్రిడేటేడ్ ఇన్వెస్టర్ హోదా కోసం: సెబీ

దిల్లీ: అక్రిడేటేట్ ఇన్వెస్టర్ (అర్హత కలిగిన మదుపర్ల) హోదా పొందేందుకు 'సెక్యూరిటీస్- మార్కెట్- అసెట్స్' అర్హతా ప్రమాణాలను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ప్రతిపాదించింది. దీని ద్వారా ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధులు (ఏఐఎఫ్) వంటి వాటిల్లో మదుపర్ల ప్రాతినిధ్యాన్ని మరింత విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రతిపాదన ప్రకారం.. అక్రిడేటేడ్ ఇన్వెస్టర్ హోదా పొందేందుకు వ్యక్తులైతే ప్రస్తుత ఆదాయం లేదా నికర విలువ (నెట్‌వర్త్) నిబంధనలతో సంబంధం లేకుండా కనీసం రూ.5 కోట్ల సెక్యూరిటీస్- మార్కెట్ ఆస్తులు కలిగి ఉండాలి. కార్పొరేట్ సంస్థలు, ట్రస్టులకు (కుటుంబ ట్రస్టులు కాకుండా) ఈ పరిమితి రూ.20 కోట్లుగా ఉండనుంది. ప్రస్తుతం వ్యక్తులు, హిందు అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), ఏక యాజమాన్య వ్యాపార సంస్థలు (సోల్ ప్రొప్రయిటరీషిప్స్) నిర్దేశిత ఆదాయం (కనీసం రూ.2 కోట్లు) లేదా నికర సంపద (రూ.7.5 కోట్లు)లో ఏది తృప్తిపర్చినా అక్రిడేటేడ్ ఇన్వెస్టర్‌గా అర్హత పొందే వీలుంది.

**అమెరికాలోనే టాప్..**

# విదేశాల్లో భారతీయ విద్యార్థులపై దాడులు




విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు విద్యార్థుల భద్రతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఆందోళ నకరమైన నిజాలను వెల్లడించింది. గత ఐదేళ్ల కాలంలో విదేశీ గడ్డపై భారతీయులపై జరిగిన దాడి ఘటనల్లో అమె రికా ప్రథమ స్థానంలో నిలిచినట్లు కేంద్ర విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం పెద్ద సంఖ్యలో ప్రవాస భారతీయులు అమెరికాను ఆశ్రయిస్తున్న తరుణంలో, అక్కడ నమోదవుతున్న ఈ గణాంకాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గత ఐదేళ్లలో కేవలం అమెరికాలోనే భారతీయులపై సుమారు 33 దాడి ఘటనలు నమోదయ్యాయి. అమెరికా తర్వాత యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ - 32), యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే - 31), కెనడా (30) మరియు ఐర్లాండ్ (24) తదితర దేశాలు తర్వాతి స్థానాల్లో ఉన్నట్లు కేంద్రం తెలిపింది. అమెరికా భారతీయ విద్యార్థులు, వృత్తి నిపుణులకు ప్రధాన గమ్యస్థానంగా ఉన్నప్పటికీ.. ఇటీవల అక్కడ మారుతున్న పరిస్థితులు కలవరపెడుతున్నాయి. తాజా విద్యా సంవత్సరంలోనూ అంతర్జాతీయ విద్యార్థులలో భారతీయుల సంఖ్య గణనీయంగానే ఉన్నా, మరోవైపు వీసా నిబంధనలు మరింత కఠినతరం కావడం, ప్రవేశ తనిఖీలు పెరగడం వంటి పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. విదేశాల్లో భారతీయ పౌరుల రక్షణే తమ సర్వోన్నత ప్రాధాన్యమని కేంద్ర ప్రభుత్వం మరోసారి పునరుద్ఘాటించింది. విదేశాల్లో ఎక్కడైనా ఇటువంటి అవాంఛనీయ ఘటనలు ఎదురైనప్పుడు, వెంటనే స్థానికంగా ఉన్న భారతీయ రాయబార కార్యాలయాలు రంగంలోకి దిగుతున్నాయని తెలిపాయి. బాధితులకు తక్షణ సాయం అందేలా చూడటంతో పాటు, స్థానిక ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి బాధ్యులకు తగిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.




## 2028 కల్లా భారత్‌లో ఎగిరే కార్లు

- తొలుత వైద్య అవసరాలకు
- తర్వాత ప్రయాణికులకు ఎయిర్‌ట్యాక్సీగా
- జపాన్‌కు చెందిన స్కైడ్రైవ్ సీఈఓ వెల్లడి

మన దేశంలోనూ ఎగిరే కార్లు త్వరలో రానున్నాయ్. 2028 కల్లా భారత్‌లో తమ ఈవీటీఓఎల్ (ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్ ఆఫ్ అండ్ ల్యాండింగ్) వాహనాలు ప్రవేశ పెట్టాలని భావిస్తున్నట్లు జపాన్‌కు చెందిన 'ఫ్లైయింగ్ కార్' తయారీ సంస్థ స్కైడ్రైవ్ ఇంక్ అంటోంది. తొలుత మెడికల్ లాజిస్టిక్స్ విభాగంలో సేవలందించాలని భావిస్తున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ తొమొహిరో పేర్కొన్నారు. అవయవ మార్పిడి సమయంలో, అవయవాల రవాణాకు సమయమే అత్యంత కీలకమని.. ఈవిషయంలో భారత్‌లో తమ ఈవీటీఓఎల్ వాహనాలను ఉపయోగించడానికి ఎయిరిండియా, సుజుకీతో ఇటీవలే ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈవీటీఓఎల్ ఎయిర్‌క్రాఫ్ట్‌లనేవి రన్‌వే అవసరం లేకుండా నిలువుగా ల్యాండింగ్, టేకాఫ్ చేయగల చిన్నపాటి విద్యుత్ విమానాలు. ఇప్పటికే వీటిపై పరీక్షలు పూర్తయ్యాయని, గంటకు 100 కి.మీ. వేగంతో, 300కు పైగా పర్యాయాలు విజయవంతంగా ప్రయాణించాయని, ఇపుడు సర్టిఫికేషన్ దశలో ఉన్నాయని తొమిహిరో పేర్కొన్నారు. రెండేళ్లలో జపాన్‌తో పాటు భారత్‌లోనూ వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభిస్తామని అన్నారు. ఎక్కడ తయారీ: జపాన్‌లో ఈ ఫ్లైయింగ్ కార్ల తయారీకి సుజుకీతో స్కైడ్రైవ్ ఒప్పందం కుదుర్చుకుంది. భవిష్యత్‌లో భారత్‌లోనూ తయారీ చేపట్టి, పశ్చిమాసియా, ఆఫ్రికాకు ఇక్కడి నుంచే ఎగుమతులు చేస్తామని తెలిపింది. ఇప్పటికే 450 ప్రీఆర్డర్లు లభించగా, అందులో 50 భారత్ నుంచే ఉన్నాయని తొమిహిరో వెల్లడించారు. తొలుత వైద్యపరమైన అవసరాలకు, తర్వాత ప్రయాణికులను తీసుకెళ్లే ఎయిర్ ట్యాక్సీ వైపునకు అడుగులు వేస్తామని వివరించారు.

## నాతో విభేదిస్తే న్యాయవాదిగా ప్రవేశించే హక్కు ఆపుతారా!

- అది నాకు విద్యార్థులకు సంబంధించింది
- నిరసన తెలిపే హక్కు వారికుంది
- నల్సార్ ఘటనపై బీసీఐ జోక్యం సరికాదు
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆగ్రహం



**న్యూఢిల్లీ,ఆగస్ట్14(జనంసాక్షి):** నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. నల్సార్ నుంచి 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించారు. అది తనకు, విద్యార్థులకు మధ్య సమస్య అని, బీసీఐ జోక్యం ఎందుకు చేసుకుందని అసహనం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ (ఏబీబబితిఇ। ఃూబీసాజీ ఐజీనిబి)ను పిలవొద్దంటూ అక్కడి విద్యార్థులు లేఖ రాసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వారిపై బీసీఐ ఆగ్రహం వ్యక్తంచేసింది. తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకూ నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర దేశవ్యాప్తంగా ఉన్న బార్ కౌన్సిళ్లకు గురువారం లేఖ రాశారు. ఆ ఉత్తర్వులపై విమర్శలు వ్యక్తమయ్యాయి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ స్పందిస్తూ.. 'రాజ్యాంగబద్ధమైన సంస్థతో విభేదించిన ఒక్కకారణంతో.. న్యాయవాద వృత్తిలో ప్రవేశించే హక్కును నిరాకరిస్తామని విద్యార్థులను బెదిరించకూడదు' అని వ్యాఖ్యానించారు. బీసీఐ స్పందించిన తీరును సీజేఐ సీరియస్‌గా తీసుకున్నారు.

# ములుగు నుంచే రహదారుల విప్లవం

- పల్లె నుంచి పట్నం దాకా రహదారులకు కొత్త బాట
- రూ.16 వేల కోట్ల భారీ ప్రణాళికకు 16న సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం
- 2,145 రహదారులు.. 7,448 కిలోమీటర్ల మేర అభివృద్ధి
- పైలాన్ ఆవిష్కరించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్ర గ్రామీణ రవాణా రంగంలో సరికొత్త అధ్యాయానికి ములుగు జిల్లా వేదిక కానుంది. గ్రామాలు, మండల కేంద్రాలు, ప్రధాన రహదారుల మధ్య మెరుగైన అనుసం ధానం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న భారీ రహదారి అభివృద్ధి కార్యక్రమానికి ఈ నెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ములుగు నుంచి శ్రీకారం చుట్టనున్నారు. సుమారు రూ.16,007 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ కార్యక్రమానికి గుర్తుగా ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు తొలి దశలో 2,145 రహ దారులను సుమారు 7,448 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు. గ్రామ పంచాయతీల నుంచి మండల కేంద్రాలకు, అక్కడి నుంచి ప్రధాన రహదారులకు నిరంతర అనుసంధానం కల్పించేలా ఈ ప్రణాళికను రూపొందించారు. గ్రామీణ రవాణా వ్యవస్థను సమూలంగా మార్చడంతో పాటు పల్లెల నుంచి పట్టణ ప్రాంతాల వరకు మెరుగైన రహదారి అనుసంధానం కల్పించాలనే దూరదృష్టితో ప్రభుత్వం బృహత్తర కార్యాచరణకు రూపకల్పన చేసింది. ప్రతి గ్రామాన్ని మండల కేంద్రంతో రెండు వరుసల రహదారితో, మండల కేంద్రాన్ని జిల్లా కేంద్రంతో నాలుగు వరుసల రహదారితో, జిల్లా కేంద్రాన్ని రాష్ట్ర కేంద్రంతో ఆరు వరుసల రహదారితో అనుసంధానించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పంచాయతీరాజ్ పరిధిలోని రహదారులను పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసేలా ప్రణాళిక రూపొందించారు. ప్రభుత్వం, బ్యాంకులు, నిర్మాణ సంస్థల భాగస్వామ్యంతో ఆర్థిక వనరులను సమకూర్చుకొని ఈ భారీ రహదారి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో కార్యరూపంలోకి తీసుకురానున్నారు.

**గ్రామీణ ప్రజల జీవన విధానంలో మార్పు**

మెరుగైన రహదారులు గ్రామీణ ప్రజల జీవన విధానంలో ప్రత్యక్ష మార్పు తీసుకురానున్నాయి. రైతులు తమ పంటలను మార్కెట్లకు సులభంగా తరలించుకోవడం, విద్యార్థులు విద్యాసంస్థలకు సౌకర్యవంతంగా చేరుకోవడం, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు వేగంగా అందుకోవడం, ఉపాధి అవకాశాలు విస్తరించడం వంటి అనేక ప్రయోజనాలు కలుగనున్నాయి. ముఖ్యంగా అటవీ, గిరిజన ప్రాంతాలు అధికంగా ఉన్న ములుగు వంటి జిల్లాలకు మెరుగైన రహదారి అనుసంధానం అభివృద్ధికి కీలకంగా మారనుంది. రహదారుల నిర్మాణాన్ని హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో చేపట్టనున్నారు. నిర్మాణ వ్యయంలో ప్రభుత్వం, నిర్మాణ సంస్థలు భాగస్వామ్యం కానుండగా, పనులు పూర్తయిన అనంతరం కూడా నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చేలా దీర్ఘకాలిక నిర్వహణ విధానాన్ని అమలు చేయనున్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత 15 సంవత్సరాల పాటు సంబంధిత నిర్మాణ సంస్థలే రహదారుల నిర్వహణ బాధ్యతలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. అటవీ, గిరిజన, ఏజెన్సీ ప్రాంతాలు అధికంగా ఉన్న ములుగు జిల్లాను ప్రారంభ వేదికగా ఎంపిక చేయడం ద్వారా మారుమూల ప్రాంతాల రహదారి అనుసంధానానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం స్పష్టమవుతోంది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి మెరుగైన రహదారులే కీలకమన్న లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమం ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతమివ్వనుంది.

## సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబం భూ అక్రమాలకు పాల్పడుతోంది

### లోకాయుక్తలో బీఆర్ఎస్ ఫిర్యాదు




**హైదరాబాద్(జనంసాక్షి):**
తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కు టుంబంపై బీఆర్ఎస్ ప్రజాప్రతి నిధులు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. రేవంత్ కుటుంబం భూ అక్రమాలకు పాల్పడుతోందని పేర్కొన్నారు. టెస్సరాక్ట్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూ ములను కేటాయించారని ఆరోపిం చారు. టెస్సరాక్ట్ కంపెనీ సీఎం తమ్ముడు కొండల్‌రెడ్డికి చెందినదని ఫిర్యాదులో పేర్కొన్నారు. "రావిర్యాలలో ఐదెకరాల భూమిని రూ.7కోట్లకు ధారాదత్తం చేశారు. టెస్సరాక్ట్ కంపెనీ మూలధనం రూ.లక్ష మాత్రమే. కొండల్‌రెడ్డి ఛైర్మన్‌గా.. నయన్‌రెడ్డి సీఈవోగా ఉన్నారు. ఆ భూ కేటాయింపులు రద్దు చేయాలి. దీనిలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, టీజీఐఐసీ అధికారుల పాత్రపై విచారణ జరిపించాలి" అని ఫిర్యాదులో బీఆర్ఎస్ నేతలు కోరారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
15 ఆగస్టు 2026

















































# అంతర్ రాష్ట్ర బైక్ దొంగల ముఠా గుట్టురట్టు

- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి
- 18 బైకుల చోరీ కేసును ఛేదించిన పెబ్బేరు పోలీసులు



**పెబ్బేరు, ఆగస్టు 14 (జనం సాక్షి) :** జల్సాల కోసం బైక్ దొంగతనాలను వృత్తిగా మార్చుకొని, తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వరుసగా బైకులు చోరీ చేస్తూ వాటిని రాష్ట్రం దాటించి విక్రయిస్తున్న అంతర్ రాష్ట్ర బైక్ దొంగల ముఠాను పెబ్బేరు పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేశారు. శుక్రవారం సాయంత్రం పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. చెలిమిల్ల గ్రామానికి చెందిన కుర్వ శ్రీరాములు తన బైక్ చోరీకి గురైనట్లు పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో రంగాపూర్ గ్రామ శివారులోని గుర్రంగడ్డ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, పోలీసులను గమనించిన నిందితుడు అమీర్ హంజా పఠాన్ బైక్‌ను అక్కడే వదిలి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా పొంతనలేని సమాధానాలు చెప్పడంతో లోతుగా విచారించారు. దీంతో తన సోదరుడు పఠాన్ నబీఖాన్‌తో కలిసి బైకులు చోరీ చేస్తున్నట్లు నేరాన్ని అంగీకరించాడు. నిందితులు ప్రధానంగా పాత బైకులు, తాళం సెట్‌లు పాడైపోయిన వాహనాలు, సైడ్ లాక్ వేయకుండా పార్కింగ్ చేసిన బైకులు, తాళాలు పెట్టి నిర్లక్ష్యంగా వదిలేసిన వాహనాలను టార్గెట్ చేసేవారు. గత రెండు నెలల్లో తెలంగాణలో 8, ఆంధ్రప్రదేశ్‌లో 10, మొత్తం 18 బైకులను చోరీ చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. చోరీ చేసిన బైకులను ఆత్మకూరుకు తరలించి విక్రయించేందుకు లింగాపురం గ్రామానికి చెందిన రమేష్, వెంకటరమణలతో ఒప్పందం చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. బైకులను తాము చోరీ చేసి తీసుకువస్తామని, వాటిని విక్రయిస్తే ఒక్కో బైక్‌కు కమిషన్ ఇస్తామని నిందితులు వారితో డీల్ కుదుర్చుకున్నట్లు తేలింది.

పెబ్బేరు, కొత్తకోట, గద్వాల, మానోపాడు, శాంతినగర్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, దోర్నాల, పాణ్యం, ఎర్రగొండపాలెం, మార్కాపురం తదితర ప్రాంతాల్లో బైకులను చోరీ చేసినట్లు విచారణలో వెల్లడైంది. చోరీ చేసిన 18 బైకుల మొత్తం విలువ సుమారు రూ.12.50 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. నిందితుల నేర చరిత్రపై ఎస్పీ వెల్లడి ప్రధాన నిందితుడు అమీర్ హంజా పఠాన్‌పై గతంలో ఒక కేసు ఉండగా, అతని సోదరుడు పఠాన్ నబీఖాన్‌పై హత్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, దొంగతనం, పీడీ యాక్ట్ తదితర తీవ్రమైన కేసులు కలిపి 14 కేసులు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. నబీఖాన్ ఇప్పటికే 13 సార్లు జైలుకు వెళ్లి వచ్చినట్లు వెల్లడించారు.

ప్రజలు తమ వాహనాల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. బైక్‌ను పార్కింగ్ చేసే సమయంలో తప్పనిసరిగా హ్యాండిల్ లాక్, సైడ్ లాక్ వేసి, సాధ్యమైనంత వరకు సురక్షిత ప్రదేశంలో పార్కింగ్ చేయాలి. తాళాలు పెట్టి వాహనాలను నిర్లక్ష్యంగా వదిలివేయడం వల్ల దొంగలకు అవకాశం కలుగుతుంది. పాత బైకులు, తాళాలు సరిగా పనిచేయని వాహనాలు కూడా దొంగల టార్గెట్‌గా మారే అవకాశం ఉంది. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. ప్రజల భద్రతకు భంగం కలిగించే నేరాలకు పాల్పడే వారిపై వనపర్తి జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారు. అంతర్ రాష్ట్ర స్థాయిలో నేరాలకు పాల్పడుతున్నా నిందితులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం." అని ఎస్పీ స్పష్టం చేశారు. కేసును ఛేదించడంలో సమర్థవంతంగా పనిచేసిన వనపర్తి డీఎస్పీ గిరిబాబు, కొత్తకోట సీఐ రాంబాబు, పెబ్బేరు ఎస్సై వెంకటేష్ గౌడ్లను ఎస్పీ అభినందించారు. అదేవిధంగా నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్ రెడ్డి, కానిస్టేబుళ్లు నరసింహ, విజయ్, రైటర్ ఆంజనేయులులను నగదు బహుమతితో అభినందించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట సీఐ, రాంబాబు, పెబ్బేరు ఎస్సై, వెంకటేష్ గౌడ్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బొమ్మబొరుసు ఆడుతున్న వారిపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

- 13 మంది అరెస్ట్, 6గురు పరారీ
- 14 మొబైల్ ఫోన్లు, రూ.55,375 నగదు స్వాధీనం
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు



**అల్లాదుర్గం, ఆగస్టు 14 (జనంసాక్షి) :** అల్లాదుర్గ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కె.ఎన్.ఆర్. క్రషర్ వెనుక బొమ్మ బొరుసు ఆడుతున్న స్థావరంపై మెదక్ జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిఘా ఏర్పాటు చేసి, బొమ్మ బొరుసు ఆడుతున్న స్థావరంపై దాడి నిర్వహించారు. ఈ దాడిలో బొమ్మ బొరుసు ఆడుతున్న 13 మందిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరో 6 గురు పోలీసులను చూసి అక్కడి నుంచి పరారైనట్లు జిల్లా ఎస్పీ వెల్లడించారు. పట్టుబడిన వారి వద్ద నుంచి 14 మొబైల్ ఫోన్లు, రూ.55,375 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా బొమ్మ బొరుసు, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా, నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాటికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముస్తాబైన కలెక్టరేట్

- పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి) :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శనివారం వనపర్తి ఐడీఓసీ ప్రాంగణంలో నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఉదయం 9.30 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమానికి శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేడుకల వేదిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లతో పాటు తాగునీరు, మీడియా ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు సరిపడా కుర్చీలు, ఇతర మౌలిక సదుపాయాలు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

### మధ్యాహ్నం డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటలకు ఐడీఓసీ సమావేశ మందిరంలో లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్య అతిథి పట్నం మహేందర్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా లబ్ధిదారులకు కార్డులను అందజేయనున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 2 గంటలకు డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన వెంటనే వనపర్తి జిల్లాలోనూ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్. ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్‌కుమార్, ఆర్డీఓ సుబ్రమణ్యం, పరిపాలన అధికారి భానుప్రకాశ్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## ప్రభుత్వ విద్యను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి) :** ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆస్తులు కూడబెట్టడం కంటే వారికి అందించగలిగే గొప్ప ఆస్తి నాణ్యమైన విద్యేనని అన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యా రంగ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా విద్యా రంగంలో ముందంజలో ఉన్న దేశాల విద్యా విధానాల్లోని ఉత్తమ పద్ధతులను తెలంగాణలో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థులకు ఆధునిక విద్యతో పాటు నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు సైతం కార్పొరేట్ విద్యార్థులతో సమానంగా పోటీ పడేలా ప్రభుత్వ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తే తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తని, నేటి విద్యార్థులను రేపటి బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ కుమార్, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, జిల్లా నాయకులు బ్రహ్మం చారి, పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కేబినెట్‌లో జెన్-జీ యువతకు అవకాశం కల్పించాలి



**ముషీరాబాద్, ఆగస్టు 14 (జనం సాక్షి) :** కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర కేబినెట్ లో జెన్-జీ యువతకు అవకాశం కల్పించాలని, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులోనూ జెన్-జీ యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటుతూ శుక్రవారం నిర్వహించిన హర్ ఘర్ తిరంగా యాత్రలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. యాత్రలో పాల్గొన్న వారంతా జెన్-జీకి చెందిన యువతేనని పేర్కొన్నారు. కులం, మతం, ప్రాంతం అనే తేడాలు లేకుండా జాతీయ జెండాను చేతపట్టి తిరంగా యాత్ర నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. జాతీయ జెండాలోని అశోక చక్రం నిరంతర అభివృద్ధికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం త్యాగాలు, బలిదానాలు చేసిన మహనీయుల చరిత్రను నేటి యువతకు గుర్తు చేయడమే తిరంగా యాత్ర ఉద్దేశమన్నారు. 21 ఏళ్లకే చట్టసభల్లోకి వెళ్లే అవకాశం కల్పించాలనే అంశంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ జెండాను కాపీ కొట్టిందని, దేశ అభివృద్ధిని అడ్డుకుందని బండి సంజయ్ విమర్శించారు. అభివృద్ధి అంటే ఏమిటో చేతల్లో చూపించిన మహనీయుడు ప్రధాని మోదీ అని అన్నారు. మోదీ పాలనలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చారని పేర్కొన్నారు. మోదీ పాలనకు ముందు దేశంలో అల్లర్లు, అవినీతి, అక్రమాలు రాజ్యమేలాయని విమర్శించారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ మహాదేవ్, ఆపరేషన్ సింధూర్ వంటి చర్యలతో ఉగ్రవాదులకు గట్టి బుద్ధి చెప్పారని అన్నారు. అంతర్గత భద్రతతో పాటు రోడ్లు, రైల్వేలు, విమానయాన రంగాల్లో ఊహించని స్థాయిలో అభివృద్ధి జరిగిందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. భారతీయుడిగా పుట్టడమే పూర్వజన్మ సుకృతమని, 'ఈ దేశం నాకేం చేసిందని కాకుండా దేశానికి నేనేం చేశాను' అని ప్రతి ఒక్కరూ గుండెపై చేయి వేసుకుని ఆలోచించాలని సూచించారు.

## అత్యవసర వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**యాచారం, ఆగస్టు 14 (జనం సాక్షి) :** ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా జీవీకే ఈఎమ్‌ఆర్‌ఐ సేవల జిల్లా అధికారి షేక్ జాన్ షాహిద్ కోరారు. గురువారం ఆయన మేనేజర్లు రాజబాబు, శ్రీహరిలతో కలిసి యాచారం సీహెచ్‌సీ ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తామన్నారు. రంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతం 32 అత్యవసర '108' అంబులెన్సులు, గర్భిణుల కోసం 10 '102' అమ్మఒడి వాహనాలు, మూగజీవాల కొరకు 4 '1962' పశు సంచార వాహనాలు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నాయని వివరించారు. మాతా శిశు మరణాల నివారణకు ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషించాలని, ఈ సేవలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా సిబ్బంది అప్రమత్తంగా ఉండి తక్షణమే స్పందించాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది విధి నిర్వహణ, పనితీరు బాగుందని ఆయన అభినందించారు.

## సేంద్రియ వ్యవసాయంతోనే మహిళల ఆరోగ్యం



**నవాబ్‌పేట, ఆగస్టు 14 (జనం సాక్షి) :** రసాయన ఎరువులను తగ్గించి, సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయడం ద్వారానే మహిళా రైతుల ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని భారతీయ కిసాన్ సంఘ్ అఖిల భారత కార్యవర్గ సభ్యులు ముదిగంటి శ్రీధర్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ (పాలమూరు) జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ ముఖ్య కార్యకర్తల కుటుంబ సమ్మేళనం నవాబ్‌పేట మండలం గురుకుంట గ్రామంలోని సాయిబాబా దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు ధర్పల్లి రాంరెడ్డి గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ముదిగంటి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సంవత్సరాన్ని 'మహిళా రైతు సంవత్సరం'గా ప్రకటించుకున్నట్లు వెల్లడించారు. ప్రతి వ్యవసాయ కుటుంబంలో దాదాపు 70 శాతం పనులను మహిళలే నిర్వహిస్తుంటారని ఆయన గుర్తు చేశారు. పంట పొలాల్లో విచ్చలవిడిగా వాడుతున్న రసాయన ఎరువుల ప్రభావం వల్ల స్త్రీలు ఎక్కువగా అనారోగ్యం బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని నివారించడానికి సేంద్రియ సాగు పద్ధతులనుఅవలంబించాలనిపిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లావణ్య రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో మార్కెట్లో దొరికే పాలు విపరీతంగా కలుషితమవుతున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్యాకెట్ పాలపై ఆధారపడటం తగ్గించి, ప్రతి ఒక్కరూ పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సంఘ్ రాష్ట్ర సంఘటన మంత్రి మాదిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేటీదొడ్డి, గట్టు మండలంలోని రైతుల చిరకాల కల సాకారం

- గట్టు ఎత్తిపోతల సామర్థ్యం 3 టీఎంసీలకు పెంపు
- క్యాబినెట్ నిర్ణయంపై హర్షం
- రూ. 1,781 కోట్లతో ప్రాజెక్ట్ రీడిజైన్ ఆమోదం
- గద్వాల నియోజకవర్గం సస్యశ్యామలం
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



**కేటీదొడ్డి, ఆగస్టు 14 (జనం సాక్షి) :** హైదరాబాదులో క్యాబినెట్ సమావేశం నందు గద్వాల నియోజకవర్గ సంబంధించిన నల్ల సోమనాద్రి గట్టు ఎత్తిపోతల పథకం నీటి నిల్వ సామర్థ్యాన్ని 1.3 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెంచుతూ, ఇందుకు రూ. 1,781 కోట్ల నిధులను మంజూరు చేస్తూ రాష్ట్ర క్యాబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం పట్ల స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రైతులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ గట్టు ఎత్తిపోతల ప్రాజెక్ట్ సామర్థ్యం పెంపుతో గద్వాల నియోజకవర్గం లోని ప్రతి ఎకరానికీ సాగునీరు అంది ప్రాంతం సస్యశ్యామలం కానుందని పేర్కొన్నారు. దశాబ్దాలుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న ప్రాంత రైతాంగానికి ఈ నిర్ణయం సరికొత్త భరోసానిచ్చిందని తెలిపారు. రైతుల చిరకాల వాంఛను నెరవేరుస్తూ నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి , నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, ఉమ్మడి జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావుకి, వాకిటి శ్రీహరికి ఎమ్మెల్యే రైతుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ నల్ల హనుమంత మాట్లాడుతూ గద్వాల ప్రాంత రైతుల సాగునీటి కష్టాలను గుర్తించి, ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వానికి ధన్యవాదాలు. సామర్థ్యాన్ని పెంచి నిధులు మంజూరు చేయడం మా ప్రాంత రైతులకు ఎంతో మేలు చేకూరుస్తుంది" అని పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఉరుకుందు మాట్లాడుతూ గతంలో కేవలం 1.3 టీఎంసీలుగా ఉన్న ప్రాజెక్టు సామర్థ్యాన్ని ఏకంగా 3 టీఎంసీలకు పెంచడం మా ప్రాంత రైతాంగానికి ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. మా విజ్ఞప్తిని మన్నించి ఇంతటి భారీ నిధులు కేటాయించిన ముఖ్యమంత్రికి, మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి జూపల్లి కృష్ణారావుకి, వాకిటి శ్రీహరికి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు ఈ ప్రాజెక్టుతో కేటీదొడ్డి, గట్టు మండలాల రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు నిండుతాయి" అని తెలిపారు. ఈ కార్యక్రమం మార్కెట్ యార్డు చైర్మన్ నల్ల హనుమంతు సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, గట్టు మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు ఉరుకుందు, కేటి దొడ్డి వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, సింగల్ విండో డైరెక్టర్ రఘుకుమార్ శెట్టి, కేటి దొడ్డి మండల యూత్ ప్రెసిడెంట్ మల్లేష్ గౌడ్ వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మరికుంట చెరువు రోడ్డుకు మహర్దశ

- నూతన రోడ్డు నిర్మాణానికి హామీ



**హయత్‌నగర్, ఆగస్టు 14 (జనం సాక్షి) :** హయత్‌నగర్‌లోని కుమ్మరికుంట చెరువు కట్టపై ఉన్న రహదారిపై ప్రయాణించేందుకు ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్పందించారు. సమస్యను పరిష్కరించే దిశగా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతోను సదరు ప్రాంతానికి తీసుకువచ్చి రహదారి పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. కుమ్మరికుంట చెరువు కట్టపై ఉన్న ఈ రహదారిపై ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, రహదారి అధ్వానంగా ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా నూతన రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయడంతో పాటు చెరువు కట్టను వెడల్పు చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై జోనల్ కమిషనర్ వికాస్ మహతో సానుకూలంగా స్పందించారు. కుమ్మరికుంట చెరువు కట్టను వెడల్పు చేయడంతో పాటు నూతన రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులను యుద్ధప్రాతిపదికన మంజూరు చేసి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. నూతన రోడ్డు నిర్మాణం, కట్ట వెడల్పు పనులు పూర్తయితే ఈ మార్గంలో ప్రతిరోజూ రాకపోకలు సాగించే వందలాది వాహనదారులకు, స్థానిక ప్రజలకు ఎంతో ఉపశమనం కలగనుంది. సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే చొరవ తీసుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


































Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist. Telangana 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad-500034, Telangana, Editor: M.M.RAHMAN RNI No. APTEL/2013/50370